


చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





# నేడు మెగా డీఎస్సీ నోటిఫికేషన్

## ఉపాధ్యాయ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు పుట్టినరోజు కానుక - షెడ్యూల్ ప్రకటించిన మంత్రి లోకేష్



- 16,347 టీచర్ పోస్టులు భర్తీ
- నేటి ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్
- నేటి నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు
- మ్యానిఫెస్టోలో కీలకహామీ నెరవేరుస్తున్నామన్న మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ షెడ్యూల్ విడుదలయింది. విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ డీఎస్సీ షెడ్యూల్ ప్రకటించారు. నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు పుట్టినరోజు కానుకగా ఈ నెల 20వ తేదీ ఆదివారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

మొత్తం 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉపాధ్యాయ అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేదీ నుండి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుండి జులై 6వ తేదీ వరకు సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. మెగా డీఎస్సీ -2025 పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం.. సంబంధిత జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షా షెడ్యూలు, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్ డెస్క్ వివరాలు 20వ తేదీ ఉదయం 10 గంటల నుండి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ (https://cse.ap.gov.in/ https://apdsc.apcfss.in)లో అందుబాటులో ఉంచుతారు.

ఉపాధ్యాయ అభ్యర్థులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల సాకారం కానుందని ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. మ్యానిఫెస్టోలోని కీలక హామీని నెరవేరుస్తూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామన్నారు.

అంకితభావం, అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం ద్వారా పాఠశాలలను బలోపేతం చేయడంలో ఇది చారిత్రాత్మక ముందడుగుగా పేర్కొన్నారు. ఓర్పు, పట్టుదలతో వేచి ఉన్న ప్రతి అభ్యర్థికీ కల నిజం చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. అభ్యర్థులు అకుంఠిత దీక్షతో కృషి చేసి ఈ ప్రయత్నంలో విజయం సాధించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

## సీఎం చంద్రబాబు జన్మ దినోత్సవ ప్రత్యేక సంచిక

నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో

## సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఘనంగాజరగనున్నాయి. ఉదయం 8:30 గంటలకు పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సీఎం చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలియజేస్తారు. అనంతరం పాట విడుదల, సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, చంద్రబాబు అభిమానులు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు.

## 'సమగ్ర శిక్షా' పాతికేళ్ల ప్రస్థానం ప్రశంసనీయం

- మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): పాతికేళ్లు పూర్తి చేసుకున్న సమగ్ర శిక్ష.. ఉన్నత లక్ష్యాలతో అందరికీ విద్యను అందిస్తూనే, విద్యార్థుల శారీరక, మానసిక, విద్యా వికాసానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ కొనియాడారు. సమగ్ర విద్యా ప్రయాణంలో భాగమైన ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంస్థలు, సంఘాలకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఎన్నో అవార్డులు- రివార్డులు సాధించిన సమగ్ర శిక్షా.. టీం వర్క్‌తో మరిన్ని లక్ష్యాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. సమగ్ర శిక్షా పాతికేళ్ల ప్రస్థానాన్ని 'మనబడి' మాసపత్రికలో చక్కగా వివరించారని అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన విద్యాసంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలు 'మనబడి' ద్వారా ప్రచారం కల్పిస్తున్న సంపాదక బృందాన్ని అభినందిస్తున్నానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## స్వచ్ఛాంధ్ర.. సీఎం చంద్రబాబు సంకల్పం




- అందరం కలిసి విజయవంతం చేద్దాం
- పురపాలక మంత్రి నారాయణ పిలుపు
- గత ప్రభుత్వానికి చెత్త పన్నుపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదని విమర్శ
- నెల్లూరులో భారీగా స్వచ్ఛాంధ్ర ర్యాలీ

3

## ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం




- పోలీసుల భద్రత, వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లాకో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్
- ప్రకాశం జిల్లాలో సున్నా స్థాయికి సైబర్ నేరాలు
- వైసీపీ హయాంలో పోలీస్ శాఖలో నియామకాలు లేవు
- కొత్తగా 10 పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- గుంటూరు రేంజ్ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత

2

## జీవీఎంసీపై కూటమి జెండా

3

విశాఖ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

## క్రీడాకారుల ప్రయోజనాలపై సీఎం దృష్టి

- ఏపీలో స్పోర్ట్స్ రిజర్వేషన్ 3శాతం అమలుకు మార్గదర్శకాలు
- జీఓ జారీతో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు
- రిజర్వేషన్ వర్తింపు 29 క్రీడల నుంచి 65కి పెంపు
- సీఎం చంద్రబాబుకు శాప్ చైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు

2



## హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

4

- సద్వినియోగం చేసుకోవాలి
- మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచన



చైతన్యరథం

# ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలి



- పోలీసుల భద్రత, వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లాకో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్
- ప్రకాశం జిల్లాలో సున్నా స్థాయికి సైబర్ నేరాలు
- వైసీపీ హయాంలో పోలీస్ శాఖలో నియామకాలు లేవు
- కొత్తగా 10 పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- గుంటూరు రేంజ్ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత

గుంటూరు (చైతన్యరథం): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా కార్యకలాపాలను అరికట్టడంతో పాటు..ప్రజలకు భరోసానిచ్చేలా టెక్నాలజీ సాయంతో ఇన్విజిబుల్ పోలీస్.. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులను హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. పోలీసుల భద్రత, వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని హోంమంత్రి అనిత వెల్లడించారు. గుంటూరు రేంజ్ పరిధిలో పోలీసు ఉన్నతాధికారులతో హోంమంత్రి అనిత గుంటూరులోని పోలీస్ కార్యాలయం వేదికగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో గత మూడు నెలలుగా సైబర్ నేరాలను సున్నా స్థాయికి తెచ్చామని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ విభాగం అందిస్తున్న సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. గుంటూరు, బాపట్ల ప్రాంతాల్లో సైబర్ నేరాలను అదుపు చేయడమే కాకుండా రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ బృందాల సహకారం తీసుకుని సైబర్ నేరాలను పూర్తిగా తగ్గిస్తామన్నారు. అన్ని చోట్ల సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 30 పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేశామని హోంమంత్రి వెల్లడించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు తమ కర్తవ్యం నిర్వహిస్తున్నారన్నారు. హైకోర్టు, రాజధాని, సచివాలయం, రాజకీయ పార్టీ కార్యాలయాలు, నాయకుల నివాసాల నేపథ్యంలో గుంటూరులో భద్రత మరింత పెంచడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ల ఆధునికీరణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. కొత్తగా 10 పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదనలు వచ్చాయని వాటి ఏర్పాటు దిశగా ముందుకెళతామన్నారు.

### వైసీపీ హయాంలో నియామకాలు లేవు

వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం పోలీస్ శాఖలో నియామకాలు చేపట్టలేదని హోంమంత్రి అనిత విమర్శించారు. మాజీ మంత్రి రోజా వంటి వైసీపీ నాయకుల అసభ్యకర వ్యాఖ్యలు, విమర్శల తీరు వారి సంస్కారానికి నిదర్శనమని మీడియా ప్రతినిధి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వైసీపీ నాయకులు పోలీసులను కూడా బెదిరించి వారిదే పై చేయి అనిపించుకోవాలనుకుంటున్నారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను ఉద్దేశించి హోంమంత్రి అన్నారు. గోరంట్ల మాధవ్ అరెస్ట్ తదనంతర పరిణామాల్లో పోలీసుల పొరపాటు ఉందని తేలినందునే సస్పెన్షన్ చేసినట్లు స్పష్టం చేశారు. వైసీపీ చర్యలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు. నేరాలకు పాల్పడిన వాళ్లని చట్టప్రకారం శిక్షించడంపై మరింత దృష్టి సారిస్తామని హోంమంత్రి తెలిపారు.

### సీసీ కెమెరాలు కీలకం

వైసీపీ పాలనలో సీసీ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం, బాడీ వోర్న్ కెమెరా వ్యవస్థల విధ్వంసం జరిగిందని హోంమంత్రి అనిత ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.10-12 కోట్లు ఖర్చు పెట్టి ఆ విభాగాలకు తిరిగి ఊపిరి పోసిందన్నారు. సీసీ కెమెరాల ద్వారా 70 శాతం కేసుల్లో నిందితులను గుర్తించి పట్టుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టెక్నాలజీ, వసతుల కల్పన ద్వారా పోలీసుల్లో కొత్త ఉత్తేజం నింపిందన్నారు. ప్రతి ఎస్పీ పరిధిలో ప్రతి జిల్లాలో 5-10వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయవలసిందిగా లక్ష్యం నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నిందితులను పసిగట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇళ్లు, దుకాణాలు, ప్రైవేట్ పాఠశాలల వద్ద కూడా స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని హోంమంత్రి పిలుపునిచ్చారు. డ్రోన్ వస్తే పేకాట రాయుళ్ళు, తాగుబోతులు, ఆకతాయిలు భయపడి పారిపోయే పరిస్థితిలో పోలీసులు పని చేస్తున్నారన్నారు. కోటప్పకొండలో అంత రద్దీ సమయంలో కూడా డ్రోన్ వల్లే ఎక్కడా చిన్న ఇబ్బంది రాకుండా పటిష్ట నిఘా పెట్టడం సాధ్యమైందన్నారు. బాపట్లలో 16 కి.మీ పరిధిలో బీచ్, తీర ప్రాంతం నేపథ్యంలో పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా వారాంతాల్లో పటిష్ట నిఘా పెట్టామన్నారు. అక్కడి గజ ఈతగాళ్లను గుర్తించి ఎస్డీఆర్ఎఫ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించి రెస్క్యూలో మరిన్ని మెళకువలు నేర్పించి భద్రతను పెంచుతామన్నారు. బాధితులకు న్యాయం చేయడం, నేర నివారణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమన్నారు.

### మరింత పటిష్టంగా సాంకేతిక బృందాలు

ఏ శాఖకు చెందిన వారో కూడా చెప్పకుండా గత ఐదేళ్లు సచివాలయాల్లో మహిళా పోలీసుల సేవలను గత ప్రభుత్వం వాడుకుందని హోంమంత్రి అన్నారు. మహిళా పోలీసుల ద్వారా అవగాహన పెంచి నేరాల పట్ల ప్రతి కుటుంబాన్ని అప్రమత్తం చేస్తామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. మహిళా పోలీసుల విద్యార్హతలను బట్టి తగు శిక్షణనిచ్చి వారి సేవలు సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. పోలీస్ విభాగంలోని సాంకేతిక బృందాలకు మరింత నైపుణ్యమందించి పటిష్టంగా మారుస్తామన్నారు. 95-బ్యాచ్ సీఐలను డీఎస్పీలుగా ప్రమోట్ చేసే విషయంలో కోర్టు నుంచి ఇటీవల ఊరట లభించిందన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులపైన కూడా దృష్టి పెడతామన్నారు. కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి సమస్యలను అధిగమించి 6వేల మంది నియామకం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసే '112 టోల్ ఫ్రీ నంబర్' విషయంలో ఏ ఇబ్బంది లేదన్నారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అప్పటికప్పుడు సరి చేస్తామన్నారు. తుళ్లూరు కేంద్రంగా పోలీస్ అకాడమీ కోసం 8 ఎకరాల స్థలం కావాలని సీఆర్డీఏని కోరనున్నట్లు స్పష్టం చేశారు. ఆడపిల్లలను వేధించినా, దూషించినా కూటమి ప్రభుత్వం తక్షణం స్పందిస్తుందని హెచ్చరించారు.

హోంమంత్రి అనిత అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో గుంటూరు రేంజ్ ఐజి శ్రీ సర్వ శ్రేష్ట త్రిపాఠీ, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ , ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ , పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, బాపట్ల ఎస్పీ తుషార్ డూడి, నెల్లూరు అడిషనల్ ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### చీపురు పట్టిన హోం మంత్రి

సమీక్షకు ముందు గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని హోంమంత్రి అనిత పరిశీలించారు. అనంతరం స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలలో స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని నిర్వహించాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు గుంటూరు పోలీస్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత స్వయంగా చీపురు పట్టి చెత్తను ఊడ్చి పారిశుద్ధ్య కార్మికుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్రాన్ని పరిశుభ్ర, ఆరోగ్య, హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతతో ఇళ్లు, వీధులను పరిశుభ్రంగా మార్చుకోవడం అనివార్యమన్నారు.

# క్రీడాకారుల ప్రయోజనాలపై సీఎం దృష్టి

- ఏపీలో స్పోర్ట్స్ రిజర్వేషన్ 3శాతం అమలుకు మార్గదర్శకాలు
- జీఓ జారీతో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు
- 29 క్రీడల నుంచి 65 క్రీడలకు రిజర్వేషన్ వర్తింపు
- సీఎం చంద్రబాబుకు శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు



విజయవాడ (చైతన్యరథం): క్రీడాకారుల ప్రయోజనాలపై ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను 2శాతం నుంచి 3శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడమే దీనికి నిదర్శనమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. స్పోర్ట్స్ పాలసీలో పొందుపరిచిన మేరకు స్పోర్ట్స్ రిజర్వేషన్ 3శాతం అమలుకు జీఓ జారీ చేసి మరోసారి క్రీడల పట్ల చిత్తశుద్ధిని సీఎం చంద్రబాబు నిరూపించుకున్నారని వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలతో క్రీడాకారులకు గతం కంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. స్పోర్ట్స్ కోటా 3శాతం అమలుతో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖలతో సహా యూనిఫామ్ సర్వీసులన్నిటిలోనూ పోటీ పరీక్షలు అవసరం లేకుండానే క్రీడాకారులకు నేరుగా నియామక అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. గతంలో 29 క్రీడలకు మాత్రమే స్పోర్ట్స్ రిజర్వేషన్ వర్తించేదని, 3శాతం అమలుతో 65 క్రీడలకు రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గతంలో నోటిఫికేషన్ విడుదల చేసిన 10 సంవత్సరాల్లోపు మాత్రమే క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కాలపరిమితి ఉండేదని, ప్రస్తుతం విడుదలైన మార్గదర్శకాలతో స్పోర్ట్స్ రిజర్వేషన్‌కు కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా 3శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను అమలు చేయడం వల్ల క్రీడాకారులకు ప్రభుత్వ కొలువుల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చిన వారికి గ్రూపు-1 పోస్టులు, బ్రాంజ్ మెడల్ వచ్చిన వారికి గ్రూపు-2 పోస్టులు వస్తాయని అన్నారు. ఏషియన్ పారా గేమ్స్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చిన వారికి గ్రూపు-2 పోస్టులు, బ్రాంజ్ మెడల్ వచ్చినవారితో పాటు పోటీల్లో పాల్గొన్నవారికి గ్రూపు-3 పోస్టులు లభిస్తాయని తెలిపారు. అలాగే వరల్డ్‌కప్, వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే వారికి గ్రూపు-3 పోస్టులు సైతం వస్తాయని పేర్కొన్నారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినవారికి గ్రూపు-3 పోస్టులు వస్తాయని తెలియజేశారు. రెండేళ్లకు ఒకసారి జరిగే నేషనల్ గేమ్స్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినవారికి గ్రూపు-3 పోస్టులు వస్తాయని స్పష్టం చేశారు.

క్రీడాకారుల భవిష్యత్తే ధ్యేయంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందించడంతోపాటు స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను 3శాతానికి పెంచుతూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల క్రీడాకారులందరూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని, క్రీడాకారుల తరుపున, శాప్ తరుపున సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో వివరించారు.

# స్వచ్ఛాంధ్ర సీఎం చంద్రబాబు సంకల్పం

- అందరం కలిసి విజయవంతం చేద్దాం
- పురపాలక మంత్రి నారాయణ పిలుపు
- గత ప్రభుత్వానికి చెత్త పన్నుపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదని విమర్శ
- నెల్లూరులో భారీగా స్వచ్ఛాంధ్ర ర్యాలీ




నెల్లూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వం చెత్తపన్నుపై పెట్టిన శ్రద్ధ పారిశుద్ధ్యంపై పెట్టలేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. మున్సిపాలిటీల నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో పన్నులతో వచ్చే ఆదాయాన్ని వాటి అభివృద్ధికే కేటాయిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛదివస్ కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో శనివారం ఉదయం 6 గంటలకు మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలికాన్ఫరెన్స్‌కు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నెల్లూరులో మంత్రి నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని మున్సిపాలిటీల్లో ఈ – వేస్ట్ సేకరణ భారీగా చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, అన్ని శాఖల అధికారులు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ – వేస్ట్ సేకరణ నిరంతరం జరిగేలా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ర్యాలీ నిర్వాహణ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. శనివారం నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తనకు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛంద్ర – స్వచ్ఛ దివస్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

**నెల్లూరులో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ...**

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శనివారం నాడు స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. వీఆర్సీ కూడలి నుంచి నర్తకి సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో నగర ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేస్ట్‌పై పోరాటం చేయాలని మంత్రి నారాయణ ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన వచ్చింది. నర్తకి సెంటర్‌లో ఈ వేస్ట్ సేకరణ వాహనాలను మంత్రి నారాయణ ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజల చేత మంత్రి నారాయణ స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. మనస్సు స్వచ్ఛంగా ఉండి.. ఇళ్లు, పరిసరాలు స్వచ్ఛంగా ఉంటే అదే స్వచ్ఛత అని మంత్రి నారాయణ తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారని మంత్రి నారాయణ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాల్లో ఉండటంతో ఏపీ వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. 2014 నుంచి 2019 వరకు స్వచ్ఛ కార్యక్రమం సరిగానే జరిగిందని తెలిపారు. 2019 నుంచి గత జగన్ ప్రభుత్వం స్వచ్ఛ కార్యక్రమాన్ని వదిలేసిందని అన్నారు. గత ఐదేళ్లు చెత్తపై చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం నడిచిందని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్త మనకు ఇచ్చి వెళ్లిందని విమర్శించారు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా రాష్ట్రంలో ఉన్న చెత్తను శుభ్రం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి నారాయణ తెలిపారు.

# జీవీఎంసీపై కూటమి జెండా

***విశాఖ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం***





విశాఖపట్నం (చైతన్యరథం): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్, కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా పార్టీని వీడడంతో 'కూటమి' బలం పెరిగింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది సభ్యులు ఉన్నారు. సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. వీరంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయగా... కౌన్సిల్ సమావేశాన్ని వైసీపీ సభ్యులు బహిష్కరించారు. దీంతో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పదవీచ్యుతురాలయ్యారు.

**కూటమి నేతల సంబరాలు**

వైసీపీకి చెందిన మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి వేడుకలు చేసుకున్నారు.

**ఫలించిన పల్లా వ్యూహం**

విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో కూటమి విజయం సాధించడంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కీలకపాత్ర పోషించారు. రాజకీయంగా పటిష్టమైన వ్యూహంతో, చివరి క్షణం వరకూ ఒత్తిళ్లు ఎదుర్కొంటూనే చక్రం తిప్పారు. కౌన్సిలర్ల మద్దతు సమీకరించడంలో పల్లా గట్టిగా కృషి చేశారు.

**కనకమహాలక్ష్మికి పల్లా పూజలు**

విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం విజయవంతం కావడంతో పల్లా శ్రీనివాసరావు.. పూర్ణా మార్కెట్ కొత్తటౌన్‌లోని శ్రీ కనక మహాలక్ష్మీ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాల నడుమ అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గటం ప్రజల గెలుపు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి శకం మొదలైందన్నారు. విశాఖను గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో విశాఖ తిరిగి విశ్వవేదికపై వెలుగొందే రోజులు దగ్గర్లోనే ఉన్నాయియని పల్లా ధీమా వ్యక్తం చేశారు.

**జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: మంత్రి డోలా**

జీవీఎంసీ అవిశ్వాస తీర్మానంపై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. జీవీఎంసీలో వైసీపీ అరాచకాలు భరించలేకనే కార్పొరేటర్లు స్వచ్ఛందంగా కూటమికి మద్దతు తెలిపారన్నారు. ఎవరినీ ప్రలోభ పెట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. నిజాయితీగా, పారదర్శకంగా అవిశ్వాసం నెగ్గామన్నారు. గత ఐదేళ్లు వ్యవస్థలన్నీ విధ్వంసం చేసిన జగన్‌కి నేడు ప్రజాస్వామ్యం అనే పదం పలికే అర్హత కూడా లేదన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలు, దౌర్జన్యాలు, రౌడీయిజం వైసీపీ సంస్కృతే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలు యావత్ దేశం మొత్తం చూసిందన్నారు. నాడు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్షాలను నామినేషన్లు కూడా వేయనివ్వలేదని మంత్రి డోలా గుర్తు చేశారు. ప్రజలు ఛీ కొట్టినా జగన్ తీరు మాత్రం మారలేదని ధ్వజమెత్తారు. ఇక నుంచి జీవీఎంసీకి మంచి రోజులు వచ్చాయని విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## వైసీపీ హయాంలో గోశాలలో భారీగా అక్రమాలు

**- మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిపై చర్యలు తప్పవు**

**- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టీకరణ**



తిరుపతి (చైతన్యరథం): వైసీపీ హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. గోశాలలోని గోవులను ఒంగోలుకు తరలించి కమీషన్లకు అమ్మేశారని ఆరోపించారు. తిరుపతిలో టీటీడీ గో సంరక్షణశాలను శనివారం సందర్శించిన అనంతరం బీఆర్ నాయుడు మాట్లాడారు. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆయన బాగోతం బయటపడుతుందనే భయంతో రికార్డులు సైతం ఎత్తుకెళ్లారని విమర్శించారు. బీజేపీ నేత సుబ్రమణ్యస్వామికి గోశాలలో వైసీపీ హయాంలో జరిగిన అన్యాయాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఆయన ఎందుకు పిల్ వేయలేదు? టీటీడీ అంటేనే ఒంటికాలిపై లేచే సుబ్రమణ్యస్వామి నిజానిజాలు ఏంటో తెలుసుకోవాలి. గోశాలపై నలుగురు సభ్యులతో కూడిన కమిటీ వేస్తాం. ఇక్కడ ఏం జరుగుతోందన్నది కమిటీ తేలుస్తుంది. వైసీపీ చేసిన తప్పును మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తా. టీటీడీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు.

# హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- సద్వినియోగం చేసుకోవాలి
- మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచన
- హజ్-2025 ఏర్పాట్లపై తెలుగు రాష్ట్రాల సమన్వయ సమావేశం




అమరావతి (చైతన్యరథం): హజ్ యాత్రికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ న్యాయ, మైనారిటీ వ్యవహారాల సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. హజ్-2025 యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ కమిటీ సమావేశం శనివారం హైదరాబాదులో జరిగింది. తెలంగాణ సచివాలయంలో ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అధ్యక్షతన హజ్ ఏర్పాట్లపై సమీక్షించారు. హైదరాబాదు ఎంబార్కేషన్ సెంటర్ నుంచి హజ్‌కు ఏపీ నుంచి యాత్రికుల ప్రయాణం ఈనెల 29వ తేదీ నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వసతి ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాచరణ చేపట్టారు. ఏపీ హజ్ యాత్రికులకు ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద వసతుల ఏర్పాట్లపై దృష్టి సారించాలనే ఆదేశాలతో మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకునేందుకు ముందుగా రెండు రాష్ట్రాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించినట్లు మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

హజ్ యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సమన్వయ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ నేతృత్వంలో ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.హెచ్. శ్రీధర్, తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఏపీ హజ్ కమిటీ సభ్యుడు షేక్ హసన్ బాషా, తెలంగాణ హజ్ కమిటీ కార్యనిర్వాహక అధికారి సాజిద్ హుస్సేన్, ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వాహక అధికారి ఎస్.ఎం.డి. గౌస్ పీర్, ప్రత్యేక అధికారి కె. యాకూబ్ బాషా, రెండు రాష్ట్రాల పాల్గొని ఏర్పాట్లపై కీలకమైన నిర్ణయాల అమలుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రాన్ని వినియోగించుకునే ఆంధ్రప్రదేశ్ యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నోడల్ అధికారులను నియమించడం, స్పష్టమైన పికప్, డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సహాయ సేవల ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని నిర్ణయించారు.

ఎంబార్కేషన్ కేంద్రం సమీపంలో ఆంధ్రప్రదేశ్ యాత్రికులకు భద్రమైన, పరిశుభ్రమైన వసతి ఏర్పాట్ల కోసం తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీతో సమన్వయం ద్వారా తగిన ప్రాంగణాలను కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పురుషులు, మహిళల కోసం వేర్వేరు వసతి కేంద్రాలు, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజన వసతి, శుద్ధజల తాగునీటి సదుపాయాలు, సేవలందించే సంస్థలను ఎంపిక చేయడం, వాటిపై పర్యవేక్షణ విధానం అమలు చేయడం, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను సులభతరం చేయడం, సహాయ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో సహాయక సిబ్బంది నియామకం, విమానాల రాకపోకల వివరాలు, లగేజి నిబంధనలపై ఎప్పటికప్పుడు హజ్ యాత్రికులకు సమాచారం అందించడం, డాక్యుమెంట్ల ధృవీకరణ, తక్షణ సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రాల ఏర్పాటు, వసతి కేంద్రాలు, విమానాశ్రయాల్లో భద్రతా సిబ్బంది నియామకం, గుర్తింపు ధృవీకరణ, రద్దీ నివారణ చర్యలు, రోజువారీ సమీక్షలు, ఫిర్యాదు కౌంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో 2022 హజ్ యాత్ర సందర్భంగా ఎదురైన సమస్యలను పునఃసమీక్షించి, ఈసారి మరింత సమన్వయంతో సమర్థవంతంగా సేవలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసారు. ఏపీ నుంచి ఈ ఏడాది వివిధ దశల్లో హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి 1630 మంది హజ్ యాత్రకు బయలుదేరుతున్నారని, వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టి వసతులు ఏర్పాటు చేసిందని, యాత్రికులు అందరూ వీటిని వినియోగించుకోవాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

## సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి ఆనం



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నాయకులంతా వారి ప్రాంతాల్లోని ఆలయాలు, మసీదులు, చర్చిల్లో పూజలు, ప్రార్థనలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకోవాలన్నారు. టీడీపీ కార్యకర్తలు, నేతలు అన్ని మతాల్లోనూ ఉన్నారన్న ఆయన.. దేశ ఔన్నత్యాన్ని చాటుతూ చంద్రబాబు కోసం పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరులో పెద్ద ఎత్తున హోమం చేయబోతున్నట్లు మంత్రి ఆనం తెలిపారు.

## సిట్ విచారణకు మిథున్‌రెడ్డి

- 8 గంటలు ప్రశ్నించిన అధికారులు

విజయవాడ (చైతన్యరథం): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు శనివారం ఎంపీ మిథున్‌రెడ్డి వచ్చారు. మిథున్ రెడ్డితో పాటు ఆయన తరపు న్యాయవాది సోడిశెట్టి మన్మథ రావు హాజరయ్యారు. కాగా.. సిట్ విచారణకు సంబంధించి మిథున్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. విచారణ సందర్భంగా ఆడియో, వీడియో రికార్డు చేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే ఇందుకు న్యాయస్థానం తిరస్కరించింది. న్యాయవాది సమక్షంలో విచారణకు అంగీకరించింది. అంతేకాకుండా విచారణకు న్యాయవాది ఆటంకం కలిగించవద్దని.. పది అడుగుల దూరంలో లాయర్ ఉండేలా అవకాశం కలిపిస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఆయనను దాదాపు 8 గంటల పాటు సిట్ బృందం విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసి సంతకాలు తీసుకుంది. వివిధ అంశాలపై ఆరా తీసిన అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మరోసారి ఆయన్ను పిలిచే అవకాశముంది. వైసీపీ హయాంలో మద్యం పాలసీ రూపకల్పన, మిథున్‌రెడ్డి ప్రమేయం, డిస్టిలరీల నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం కొనుగోళ్లపై సుదీర్ఘంగా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. రాజ్ కసిరెడ్డికి చెందిన అదాన్ డిస్టిలరీ, డికార్ట్ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎంతమేర కొనుగోళ్లు చేసిందని ప్రశ్నించినట్లు సమాచారం. రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరులు చాణక్య రాజ్, అవినాష్‌రెడ్డిలతో మిథున్‌రెడ్డికి ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీల గురించి సిట్ అధికారులు ప్రశ్నించారు. కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. సిట్ విచారణ అనంతరం బయటకు వచ్చిన మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ కోర్టులో ఉన్నందున, ఈ వ్యవహారంలో ఇప్పుడేమీ మాట్లాడలేనని చెప్పారు.

## లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యం

- సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష





పెనమలూరు, ఏప్రిల్ 19 : దివంగత నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పలాస ఎమ్మెల్యే, లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కృష్ణా జిల్లా, పెనమలూరు నియోజకవర్గం, యనమలకుదురులో నూతనంగా ఏర్పాటుచేసిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే శిరీష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. తెలుగువారి రాజకీయ జీవనం లో స్వాతంత్రానికి ముందు, తరువాత ప్రభావితం చేసిన నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు.

కేవలం స్కూలు విద్యకే పరిమితమైన ఆచార్య గోగినేని రంగ ప్రథమ అనుచరుడుగా, తెలుగులో మంచి ఉపన్యాసకుడిగా, రాజాజీ ఉపన్యాసాల అనువాదికుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగు వర్గ పోరాటజీవి సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన మహనీయుడు అన్నారు. స్వాతంత్రోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న, జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా చరిత్రలో నిలిచిపోయారు అన్నారు. మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతో ప్రభావితుడైన సర్దార్ గౌతు లచ్చన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారు చేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి ఆహుతి చేశాడని పోరాట యోధుడైన సర్దార్ గౌతు లచ్చన్న ప్రజల హృదయాలలో ఇప్పటికీ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలని, భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న జీవిత విశేషాలను తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే శిరీష పిలుపునిచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. లచ్చన్న త్యాగనిరతిని కీర్తించారు. లచ్చన్న అనుచరుగా ఉన్నామని చెప్పుకునేందుకు తాము ఎంతో గర్వపడుతున్నామన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో, గురుభక్తిని చాటుకోవటంలో లచ్చన్నను మించిన వ్యక్తి మరొకరు లేరని కొనియాడారు. విగ్రహ దాత, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, విలువలు కలిగిన మహానాయకుడు, ప్రజాబంధుగా పేరుగడించి ఎన్నో చారిత్రక పోరాటాలు సాగించిన మహనీయుడు గౌతు లచ్చన్న అని, వారి విగ్రహం ఏర్పాటుచేసే భాగ్యం తనకు లభించటాన్ని తాను ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు.

విలువలు, విశ్వసనీయకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు లచ్చన్న అని కొనియాడారు. కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ.. లచ్చన్న ఆశయాలకు కట్టుబడి ఉంటామన్నారు. నేటితరం యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో భాగస్వాములు కావాలని బుల్లయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి మాట్లాడుతూ.. లచ్చన్నకు విగ్రహాన్ని ఏర్పాటుచేయించిన ఘనత ఏపిఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణదేనన్నారు. అన్నివర్గాలను, అన్నిపార్టీలను కలుపుకుని బందరులో లచ్చన్న విగ్రహం ఏర్పాటుచేసిన తీరు యావత్ భారతదేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అటువంటి గొప్పవ్యక్తి కొనకళ్ల నారాయణ అని, ఆయన పార్టీకి అందించిన సేవలు వెలకట్టలేనివని గురుమూర్తి కొనియాడారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

●ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

●స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపు



పార్వతీపురం (చైతన్యరథం): పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం సీతానగరం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలంతా సస్యశ్యామలంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మక తీసుకొచ్చారన్నారు. ప్లాస్టిక్ వస్తువులు మనకి ఎంత ఉపయోగకరంగా ఉంటాయో అవి ఎక్స్పైర్ అయిపోయిన తర్వాత చాలా ప్రమాదకరమన్నారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయంలో ఇ- వేస్ట్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇ-వేస్ట్ సేకరణ చేసి నిల్వ చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో వేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో పదివేల జనాభా కంటే ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఈ కార్యకలాపాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నివారించేందుకు అందరూ సహకరిస్తేనే ఈ స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, జిల్లా ప్రత్యేక భరత్ కుమార్ గుప్తాతో పాటు అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

●బీసీల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి చేశారు

●రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నిమ్మాడ (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. లచ్చన్న వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘననివాళి అర్పిస్తూన్నట్లు తెలిపారు. బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని, ఉత్తరాంధ్రుడు కావడం ఆ ప్రాంతం చేసుకున్న అదృష్టం”గా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిచేసిన ఆయనను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తుట్లు తెలిపారు.

## అవిశ్వాస తీర్మానంలో కూటమి విజయవంతం

• నెగ్గిన అవిశ్వాస తీర్మానం... జీవీఎంసీ మేయర్ పీఠం కూటమిదే



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో కూటమి విజయవంతమైంది. సమావేశానికి 74 మంది కూటమి సభ్యులు హాజరుకావడంతో అవిశ్వాసం నెగ్గారు. శనివారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రారంభమవగా... హెడ్ కౌంట్ అనంతరం అందరి వద్ద సంతకాలు తీసుకున్నాక ఓటింగ్ జరిగింది. ఓటింగ్‌లో 74 మంది సభ్యుల బలంతో కూటమి విజయం సాధించింది. అయితే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని వైసీపీ బహిష్కరించింది. వైసీపీ మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై కూటమి నెగ్గడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు సంబరాలు చేసుకుంటున్నాయి. అయితే ముందున్న 74 మెజార్టీలో ఆఖరి నిమిషంలో ఒకరు జారుకోవడంతో కూటమి నేతల్లో ఆందోళన చోటు చేసుకుంది. కానీ ఆఖరి నిమిషంలో మాజీ మంత్రి కూతురు ప్రియాంక చేరికతో విజయం సొంతమైంది. 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియల్ సభ్యుల ఓటింగ్‌తో కూటమి విజయం సాధించింది. ఇక కూటమి నుంచి మేయర్ అభ్యర్థి రేసులో పిలా శ్రీనివాస్ ఉన్నారు. విశాఖ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో శనివారం జీవీఎంసీ ప్రత్యేకంగా సమావేశమైంది. ఎలాగైనా మేయర్ పీఠం దక్కించుకోవాలన్న కూటమి నేతల ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. 74 సభ్యుల కూటమి బలంతో మేయర్‌పై అవిశ్వాసం నెగ్గారు. నాలుగేళ్ల క్రితం జీవీఎంసీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 98 వార్డులకు గాను వైసీపీ 58 వార్డులను గెలుచుకుంది. దీంతో 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి మేయర్ పీఠంపై కూర్చున్నారు. ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు, టీడీపీ నుంచి గెలిచిన ఒక్కరు కూడా వైసీపీలో చేరారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ కార్పొరేటర్లలో చాలా మంది టీడీపీ, జనసేన గూటికి చేరిపోయారు. 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో, 9 మంది జనసేనలోకి వెళ్లారు. అలాగే ఇండిపెండెంట్‌లు కూడా టీడీపీ, జనసేన పార్టీలోకి చేరిపోయారు. ఈ క్రమంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రకటిస్తూ 58 మంది కార్పొరేటర్ల సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జ్, కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. సంతకాల ధృవీకరణ కూడా జరిగిపోయింది. అవిశ్వాస తీర్మానంపై కోసం ప్రత్యేకంగా కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవిశ్వాసం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం. ఆ దిశగా వైసీపీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లను తమ వైపుకు లాక్కునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. అంతే కాకుండా వారికి భారీగా నజరానాలు కూడా ప్రకటించినట్లు తెలుస్తోంది. మరోవైపు టీడీపీ కార్పొరేటర్లు అంతా కూడా మలేషియాలోనే ఉన్నారు. అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు వైసీపీ ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శనివారం జరిగిన జీవీఎంసీ ప్రత్యేక సమావేశానికి 74 మంది కూటమి సభ్యులు హాజరై ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో మేయర్‌పై పెట్టి అవిశ్వాస తీర్మానంపై కూటమి విజయం సాధించింది.


## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన గిరిజన విద్యార్థులు

●ప్రత్యేకంగా అభినందించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి



పార్వతీపురం (చైతన్యరథం): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ చూపించిన గిరిజన విద్యార్థులను రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా, జోగంపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలైన జేఈఈ మెయిన్స్ మరియు అడ్వాన్స్‌డ్‌లలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా 137వ ర్యాంక్ సాధించిన ఎస్.నంద వర్ధన్ నిహాల్, 900వ ర్యాంక్ సాధించిన ఎస్. అఖిల్, 2864వ ర్యాంక్ సాధించిన పి.జగదీశ్వర్‌రావు, అడ్వాన్స్‌డ్ సెలెక్షన్ లిస్ట్‌కు ఎంపికైన ఇతర విద్యార్థులందరిని గుమ్మిడి సంధ్యారాణి అభినందించారు. విద్యార్థుల కృషి, గురుకులాల నాణ్యమైన బోధన విధానం, మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన వీరు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చగలిగారని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని తెలిపారు.

## పవన్, లోకేశ్‌ల పై అసభ్యకర పోస్టులు - పోలీసుల ముందు హాజరైన నటి శ్రీరెడ్డి



విజయనగరం (చైతన్యరథం): పూసపాటిరేగ పోలీసుస్టేషన్‌కు నటి శ్రీరెడ్డి విచారణకు హాజరయ్యారు. లోకేశ్, పవన్ కల్యాణ్‌పై అసభ్యకర పోస్టులు పెట్టారని, గతేడాది నవంబర్ 13న శ్రీరెడ్డిపై నెల్లిమర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందింది. నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విచారణకు శనివారం శ్రీరెడ్డి హాజరైంది. ఈ మేరకు శ్రీరెడ్డిని సీఐ రామకృష్ణ విచారించి, 41నోటీసు ఇచ్చి పంపించారు. అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని శ్రీరెడ్డికి తెలియచేశారు. సినీ నటి శ్రీరెడ్డిపై గతంలోనే కృష్ణా జిల్లా గుడివాడ పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. చంద్రబాబు, పవన్, అనితలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టారంటూ మచిలీపట్నం టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ అసిలేటి నిర్మల ఫిర్యాదు చేశారు. నిర్మల ఫిర్యాదు మేరకు శ్రీరెడ్డిపై గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, అనితలపై ఆమె ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ సీఐకి ఫిర్యాదు పత్రం అందజేశారు. విశాఖ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లోనూ శ్రీరెడ్డి మీద గతంలోనే కేసు నమోదైంది. శ్రీ రెడ్డిపై విశాఖ దక్షిణ నియోజకవర్గ తెలుగు మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు అనుచితంగా వ్యాఖ్యలు చేస్తూ, యూట్యూబ్‌లో వీడియో చేసిన శ్రీరెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

## వైసీపీ వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు : కలమట వెంకటరమణమూర్తి



శ్రీకాకుళం (చైతన్యరథం): వైసీపీ విధ్వంసం పరిపాలన వల్ల ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురయ్యిందని శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ధ్వజమెత్తారు. మండలంలోని మాతల క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజధాని లేని విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆహోరాత్రులు కష్టపడి చేసిన అభివృద్ధిని దుర్మార్గవిధానాలతో వెనక్కి నెట్టారని ఆరోపించారు. వైసీపీ నాయకులు లూలు గ్రూపు సంస్థ పారిపోయేలా చేసి ఉత్తరాంధ్ర యువత పొట్టకొట్టారని విమర్శించారు. రుషికొండ ఐటీ సెజ్ నుంచి 14 కంపెనీలు పారిపోయేలా చేయడమే కాకుండా ఫ్రాంక్లిన్ టెంప్లన్, హెచ్‌సీఎల్, ఐబీమ్, ఫింటెక్స్, హెచ్‌ఎస్‌బీసీ, షుగర్ ఫ్యాక్టరీలు, దిగ్గజ కంపెనీలు వైసీపీనాయకులదాష్టికాలను భరించలేక రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయా యని తెలిపారు. టీడీపీప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖలో టీసీఎస్ రూ.1370 కోట్లు పెట్టుబడితో 12వేలమందికి ఉద్యోగాల కల్పనకు ముందుకొస్తోందని తెలిపారు.

# స్వర్ణాంధ్ర - 2047 సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలసి నడవాలి

**●ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ ద్వారా సర్క్యులర్ ఎకానమీలో వృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం ఉదయం గన్నవరం నియోజకవర్గం, గన్నవరం మండలం, బుద్ధవరం గ్రామపంచాయతీ ఆవరణలో "ఈ-చెక్" స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ జిలాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నాడు జరుపుకుంటున్నామని, ప్రతి కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉండేందుకు నెల నెలా ఒక్కో థీమ్‌ను ఎంచుకుని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' థీమ్‌ను ఎంచుకోవడం జరిగిందని తెలిపారు. ఎందుకంటే చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుందనీ అన్నారు. ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిర్వహణ, ముఖ్యంగా పొడి మరియు ఎలక్ట్రానిక్ వ్యర్థాల సవాళ్లను పరిష్కరించడం మరియు సరైన వ్యర్థాలను పారవేయడం మరియు రీసైక్లింగ్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడమే ఈ డ్రైవ్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ వ్యర్థాల సేకరణ గురించి అవగాహన కల్పిస్తూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో కూడిన వస్తువులతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ-వేస్ట్ పరికరాలను సేకరించిన పంచాయతీ సిబ్బందిని అభినందిస్తూ, పనికిరాని ఈ-వేస్ట్ పరికరాలను ఇంటిలో ఉంచుకున్నట్లయితే వాటిలో ఉండే కెమికల్స్ వలన ఆరోగ్య సమస్యలు వస్తాయని కావున వాటన్నింటినీ పంచాయతీలకు అందజేయ వలసిందిగా పిలుపునిచ్చారు.

# పి.గన్నవరంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం

పి.గన్నవరం (చైతన్యరథం): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పి.గన్నవరం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం తెలుగుదేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పి.గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ బాలయోగి పాల్గొని జాతీయ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ పటిష్టతకు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

# రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం

**● ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులతో కలిసి అక్కడ సేకరించిన ఈ వేస్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతినెలా మూడో శనివారం ఒక్కో శనివారం ఒక్కో థీమ్‌తో ఈ స్వచ్ఛ

ఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహిస్తూ పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మంచి అలవాట్లు పాటించేందుకు సమయం పడుతుంది... చెడు ఆలోచనలు, చెడు పనులు చేయకుండా మన మైండ్‌ను నిత్యం మనమే కంట్రోల్ చేయాలని సూచించారు. ఇల్లు... మన పరిసరాలు శుభ్రంగా బాగుంటేనే మంచి ఆలోచనలు వస్తాయని, ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే ఏదైనా సాధించగలమని, పని ప్రాంతాన్ని కూడా అందరూ శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.

# భావితరాలకు స్వచ్ఛమైన సమాజం అందిద్దాం...

**●స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ**




మండపేట (చైతన్యరథం): పరిశుభ్రత మనందరి బాధ్యతని, స్వచ్ఛమైన సమాజాన్ని రేపటి తరానికి అందించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండపేట పట్టణంలో మున్సిపాలిటీ వద్ద నిరహించిన అవగాహన ర్యాలీలో శనివారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... మనమందరం మన భవిష్యత్తు గురించి, మన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి పర్యావరణాన్ని రక్షించుకోకపోతే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొవలసి ఉంటుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను సుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెట్లను పెంచటాన్ని చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటుగా మార్చాలని, చెట్ల అవశ్యకతను వివరించాలని సూచించారు. మండపేట నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతీ ఒక్కరూ భాగస్వాములైతే స్వచ్ఛాంధ్ర సహకారం సాధ్యమవుతుందని చెప్పారు. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ కారణంగా వ్యర్దాల నిర్వహణ, కాలుష్యం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నామని, వీటిని అధిగమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

# ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి పెను ముప్పు

**● వానపల్లి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు**

కొత్తపేట (చైతన్యరథం): ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్రగా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూనుకున్న ప్రతి నెల మూడవ శనివారం థీమ్‌లో భాగంగా నేడు ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడపడితే అక్కడ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పడేయడం వాటిలో విష పదార్థాలు భూమిలో కలసి పోవడం వల్ల కాలుష్యం పెరుగుతుందని అన్నారు. అందుచేత ఈ కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఈ వేస్టేజ్ రీసైక్లింగ్‌కు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను అందరిచేత ఎమ్మెల్యే సత్యానందరావు చేయించడం జరిగింది. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి దుకాణదారుల వద్ద నుంచి ఈ వేస్టేజ్‌ను పంచాయితీ పారిశుధ్య కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సత్యానందరావు సేకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండా : మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): పాలకొల్లులో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, ప్రజల అభివృద్ధి ,సంక్షేమమే అజెండాగా పని చేస్తున్నానని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన పాలకొల్లులో శనివారం కోటి ఇరవై లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పదో వార్డు జి ప్లస్ వన్ కాలనీలో 40 లక్షలతో మంచినీటి సరఫరా పైపులైన్ పనులకు, 9వ వార్డు ఆదిత్య కాలనీలో 8.30 లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 40 లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు, 31వ వార్డు క్రిస్టియన్ పేటలో 14.5 లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులకు కుటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. పశువుల ఆసుపత్రి ప్రాంతంలో 15 లక్షలతో డాగ్ స్టెరిలైజేషన్ షెడ్డు, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో మంత్రి రామానాయుడుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. ఈ కార్యక్రమాల సందర్భంగా మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వంలో పాలకొల్లు పట్టణంలో రూ.240 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగా జగన్ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులు జరగకపోగా అభివృద్ధిని ఇరవై ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నామని పనులన్నీ పూర్తయితే సమగ్ర అభివృద్ధితో అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. టిడ్కో గృహాల కాలనీ ప్రాంతంలో నరసాపురం ప్రధాన కాలవపై రెండు కోట్లతో కాలిబాట వంతెన నిర్మిస్తున్నామని, 50 లక్షలు నిధులు ఉంటే ఇరిగేషన్ నుంచి మరో కోటి 50 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రికి 12.60 కోట్లు నిధులు తీసుకొస్తే సంవత్సరంలో పూర్తి కావలసిన పనులు గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లలో పూర్తి కాలేదన్నారు. జరిగిన పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. మళ్లీ ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులతో పాటు ఎన్టీఆర్ కళాక్షేత్రం, అంబేద్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ సామాజిక భవనం, ముస్లిం షాదీ ఖానా, రామగుండం, అంబేద్కర్ ఉద్యానవనాలు, కైలాస వనం తదితర అభివృద్ధి పనులన్నిటిని పూర్తి చేసే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజల కోసం నిస్వార్ధంగా పనిచేస్తున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు.

# గౌతు లచ్చన్నకు భారతరత్న ఇవ్వాలి : దాసరి శ్యామ్ చంద్ర శేషు

జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): స్వతంత్ర సమరయోధులు, రైతు నాయకులు మరియు బిసిల ఉద్యమనేత రాజకీయ వేత్త సర్దార్ గౌతు లచ్చన్నకు భారతరత్న ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు కోరారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దాసరి శేషు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ స్వతంత్ర పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన మహనీయులు లచ్చన్న అని, రైతుల కోసం అనేక ఉద్యమాలు చేసిన రైతు నేత, బలహీన వర్గాల అభివృద్ధి, హక్కుల కోసం అనేక పోరాటాలు జరిపిన ఉద్యమనేత లచ్చన్న అని ఆయన సేవలు గుర్తు చేశారు.

# మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్ట్ సంస్థ చెప్పే సాకుల్ని ఉపేక్షించను: మాజీమంత్రి ప్రత్తిపాటి

### ●బాధ్యత విస్మరించి కుంటిసాకులు చెప్పకండి.. ఇదే అందరికీ చివరి హెచ్చరిక



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ పాలనలో తాను ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గంలో తాగునీటి, పారిశుధ్య సమస్యలతో ప్రజలు బాధపడటమేంటని, సమస్యల్ని ఒక్కరోజులో పరిష్కరించి మీరే దగ్గరుండి వారి స్పందన నాకు తెలిసేలా చేయాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వచ్ఛాంధ్ర : స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలతో కలిసి శుభ్రత-స్వచ్ఛత ఆవశ్యకత ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై ఆయన వారి సమక్షంలోనే యంత్రాంగాన్ని ప్రశ్నించారు. తాగునీటి, పారిశుధ్య సమస్యల్ని కూడా పరిష్కరించకపోతే ఎలాగని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఏం జరుగుతుందో తెలుసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ప్రత్తిపాటి ఆదేశించారు. తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యల్ని పరిష్కరించి, ప్రజలకు సకాలంలో స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని మాజీమంత్రి తేల్చిచెప్పారు. మరోసారి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, ఇదే అందరికి చివరి హెచ్చరికని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ-వ్యర్థాల కాలుష్యంతో ముందుతరాల భవిష్యత్తుకే తీరని చేటు: జీవీ, లావు



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ గుట్టలుగా పేరుకుని పోతున్న ఈ వ్యర్థాలతో భవిష్యత్ తరాలకు తీరని చేటని, సమర్థ నిర్వహణ పరిష్కారమని పిలుపునిచ్చారు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, పరిసరాలను కూడా అలానే చూసుకున్నప్పుడు, ఈ- వ్యర్థాలపై అవగాహనతో మెలిగినప్పుడే ముప్పు తప్పించుకోగలమన్నారు. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో ఎంపీలావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ఎంపీ లావు, చీఫ్‌విప్ జీవీ ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కూటమినేతలతో కలిసి పరిసరాలలో చెత్త శుభ్రం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రీ సైకిల్, రీప్రాసెస్, రీ యూజ్ విధానం, డస్ట్ బిన్స్ వాడకం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ లావు ప్రతి ఇంట్లో ఈ-వేస్ట్‌ను సమర్థంగా నిర్వహించుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 80లక్షల టన్నుల వరకు సాధారణ వ్యర్థాలు పేరుకుపోయాయని, వాటికి ఈ-వ్యర్థాలను కలిస్తే సమస్య తీవ్రం అవుతుందన్నారు. వ్యర్థాల కారణంగా కొన్నిప్రాంతాల్లో మనుషులు నివసించలేని దుస్థితి ఇప్పటికే చూస్తున్నామని, భవిష్యత్ అలా కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరుచేస్తున్నట్లే ఈ వ్యర్థాలనూ జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యం : కొండయ్య




చీరాల(చైతన్యరథం): పరిసరాల పరిశుభ్రతతో అరోగ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దలూరి మాలకొండయ్య వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛంధ్రా కార్యక్రమాన్ని శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళీతో కలిసి రామాపురం తీరం వద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. బీచ్ ఒడ్డు ప్రాంతంలోని చెత్తను ఎమ్మెల్యే కొండయ్య తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళీ, ప్రత్యేక అధికారి కృతికా కృష్ణలు స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. తోలుత స్వచ్ఛంద్ర... స్వర్ణాంద్రపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీరప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హజ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన హసన్ బాషకు అభినందనలు



గుంటూరు (చైతన్యరథం): ఏపీ నుంచి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్‌గా హాజి షేక్ హసన్ బాష వెల్లడించారు. ఇక్బాల్ మసీదులో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ప్రత్యేక దువా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయనకు మత పెద్దలు శు భాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మక్కా యాత్ర వెళ్లే హాజీల గురించి ప్రత్యేకంగా ప్రార్థించారు. హజ్ -2025 యాత్రకు ఆంధ్రప్రదేశ్ నుండి యాత్రికుల ప్రయాణాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు హసన్ బాష వెల్లడించారు.



# ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటం గౌతు లచ్చన్న



వేమూరు(చైతన్యరథం): ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటం గౌతు లచ్చన్న అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గుంటూరు జిల్లా బిసి విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతిని పురస్కరించుకుని బస్‌స్టాండ్ ఎదురు ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న అని, దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి... ఆ రాజకీయ మహా శిఖరం సర్దార్ గౌతు లచ్చన్న అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టింది. కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గౌతు లచ్చన్న ఆశయాల సాధనకై, బడుగు బలహీన వర్గాల కోసం పాటు పడుతుందని తెలిపారు. టీడీపీ జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ... గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడు... వెనుకబడిన తరగతులు, బలహీనవర్గాల బలోపేతం కోసం కృషి చేసిన గొప్ప ప్రజా నాయకుడు అని పేర్కొన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో సామాన్య కుటుంబంలో జన్మించిన గౌతు లచ్చన్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఎన్నో ఉద్యమాలు జరిపారు. భారత దేశ చరిత్రలో వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ బిరుదు అందుకొన్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. బడుగుబలహీన వర్గాల గొంతుక వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసి వారి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వెనుకబడిన తరగతుల సదస్సుకు అధ్యక్షత వహించి వారి సామజిక, ఆర్థిక మరియు విద్యాభివృద్ధికి భారత రాజ్యాంగంలో పొందుపరచిన చట్టబద్ధమైన హక్కులు, అధికారాలు సాధించడం కోసం ఎనలేని కృషి చేశారు. విలువలు, విశ్వసనీయతలే ఆభరణాలుగా నిబద్ధత గల రాజకీయాలు చేసిన వారు ఎందరికో స్ఫూర్తి. వారి అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయసాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## డ్రైనేజీల నిర్మాణాలకు ఎంపీ శంకుస్థాపన... పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ కానూరు మహాదేవపురం నందు 40లక్షల రూపాయలతో మాణిక్య నగర్ నుండి మెయిన్ రోడ్ వరకు, 39లక్షల రూపాయలతో మాణిక్య నగర్ నుండి ఒల్డేజ్ హోమ్ రోడ్ వరకు, 35లక్షల రూపాయలతో మిటాయి షాప్ నుండి కానూరు పెట్రోల్ బంకు వరకు డ్రైనేజిల నిర్మాణాలకు మంచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధ్వానంగా మారిందని, దోచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించారని అన్నారు. కనీస సదుపాయాలు కల్పించలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించడం జరిగిందని తెలిపారు.

## గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కొత్తపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వాడపాలెం గ్రామంలో ఇంటింటికి తాగునీటి పథకం ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకును, తాగునీటి పంపిణీ కుళాయిలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికై ఢిల్లీలో అవార్డును అందుకున్న త్సామా ఆదినారాయణమూర్తి(బాబు)ను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మేము సైతం







**టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సంకల్పంతో మొదలైన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రంలో ఉద్యమంలా సాగుతోంది. బస్టాండ్ పరిధిలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం .. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డాక్టర్ సురేష్ బాబు ఆర్టీసీ డిపో మేనేజర్ రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.**

### గంగాధరనెల్లూరులో...

**గంగాధర్ నెల్లూరు:** కార్వేటినగరం మండలం కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జీడీ నెల్లూరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే) డాక్టర్ వి ఎం థామస్ గ్రీన్ అంబాసిడర్‌తో కలిసి చెత్త ఎలక్ట్రానిక్ వస్తువులను స్వీకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

### పలమనేరులో...

**పలమనేరు** : ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్ తో పర్యావరణానికి పెను ముప్పని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్ధాలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్ధాలతో పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతుందని మానవాళి మనుగడకే ప్రశ్నర్ధకంగా మారుతుందన్నారు. ఈ వేస్ట్ వ్యర్ధలతో పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతినే ఆస్కారముందన్నారు. కాబట్టి ఈ వేస్ట్ వ్యర్ధాలపై ప్రజల అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గంగమ్మ గుడి వీధి మీదుగా అవగాహన ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ.రమణారెడ్డి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బాబా,మున్సిపల్ సిబ్బంది తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా పీర్, చాంద్ భాషా, బీ.ఆర్.సి కుమార్, లోకేష్ ఆచారి, నదీం, సురేష్, మురళీ, చందు తదితరులు ఉన్నారు.

### వేటపాలెంలో...

**వేటపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వేటపాలెం మండలం అక్కయ్యపాలెం పంచాయతీ రామాపురం గ్రామం నందు తీరం వద్ద బీచ్ క్లీనింగ్ నిర్వహించారు.పరిసరాల పరిశుభ్రతతో అరోగ్య అంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుకోవచ్చని ఎమ్మెల్యే శ్రీ మద్దులూరి మాలకొండయ్య గారు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛంద్ర కార్యక్రమన్నీ బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళీ చీరాల నియోజకవర్గంలోని రామాపురం తీరం వద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం. ఏం కొండయ్య యాదవ్ పాల్గోన్నారు. బీచ్ ఒడ్డు ప్రాంతంలో గల చేత్తను ఎమ్మెల్యే ఎం. ఏం కొండయ్య యాదవ్ జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళీ, స్పెషలాఫీసర్ కృతికా కృష్ణ స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు తోలుత స్వచ్ఛంద్ర.. స్వర్ణాంధ్ర పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీరప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు.

### చంద్రగిరిలో ...

**చంద్రగిరి:** చంద్రగిరిలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హాజరయ్యారు. చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛత హీ సేవ 2025 కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గడియారం మాను వద్ద మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ వ్యర్ధాలపై కలిగే అనర్ధాలను తెలియజేశారు.

### పూతలపట్టులో....

**పూతలపట్టు, (చైతన్యరథం):** మండలం కేంద్రం పక్కాలగుట్ట కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా "పూతలపట్టు శాసనసభ్యులు హాజరయ్యారు. పూతలపట్టు గ్రామస్థులు, యువత, మహిళా సంఘాలు, స్కూల్ విద్యార్థులు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు కార్యక్రమంలో పాల్గోన్నారు. తమ తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తాము కృషి చేస్తామని యువత, మహిళలు, గ్రామస్తుల చేత "నా గ్రామం శుభ్రత నా బాధ్యత" అనే నినాదంతో మురళీమోహన్ గారు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ గారు మాట్లాడుతూ.. "స్వచ్ఛత అనేది మన సంస్కృతిలో భాగంగా మారాలని కోరారు. పరిశుభ్రత వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని, మనం శుభ్రంగా ఉంటే మన చుట్టుపక్కల వాతావరణం కూడా ఆరోగ్యంగా ఉంటుంది" అని అన్నారు. ప్రభుత్వం ఒక్కటే కాదు, ప్రతి ఒక్కరికి శుభ్రతపై బాధ్యత ఉండాలి" అని స్పష్టం చేశారు. "పరిశుభ్రత మన జీవిత శైలిలో భాగం కావాలని, మన ఇంటి ముందు నుండి మన గ్రామం వరకు ప్రతిచోటా శుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేసే ప్రయత్నాలకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల టిడిపి అధ్యక్షులు దొరబాబు చౌదరి, టిడిపి నాయకులు చంద్రమౌళి, గుంటూరు మురళీ, చిరంజీవి గొడగుచింత దాము, హరి బాబు మరియు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.















## చంద్రబాబుకు.. సరిలేరు ఇంకెవ్వరు

అనంతపురం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ దేశంలో సరివచ్చే వారు ఇంకెవ్వరు లేరని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదినం సందర్భంగా అర్బన్ టీడీపీ కార్యాలయంలో టిడిపి వాల్మీకి సాధికారత స్టేట్ డైరెక్టర్ మణి రవి ఆధ్వర్యంలో సిబిఎన్ కామన్ డిపి పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దగ్గుపాటి టిడిపి నాయకులతో కలిసి ఈ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ టీడీపీ కార్యాలయంలో సీబీఎన్ జన్మదిన వేడుకల సంబరం ప్రారంభమైనట్టు కనిపించింది. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, బీసీ సెల్ నాయకుడు జోగి రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టెం బాలకృష్ణ, ఓంకార్ రెడ్డి, వడ్డే వెంకటేష్, ఈడిగా నాగభూషణం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే నా లక్ష్యం : ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి, (చైతన్యరథం): "ప్రజల ఆరోగ్యమే ధ్యేయం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని, జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి గ్రౌండ్స్‌లో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఇంతకుముందు కంటి ఆపరేషన్ చేయించుకున్నవారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డా. తనీమ ఆధ్వర్యంలో వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి, 100 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఏప్రిల్ 20న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాలలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. ఈ కార్యక్రమంలో శంకర ఆసుపత్రి సిబ్బంది డి. రాంబాబు, పారా మెడికల్ సిబ్బంది, వాలంటీర్లుగా తెలుగు మహిళలు కరణం అరుణ, రమదేవి, స్వప్న, తులసి, పార్వతి, నాగమణి, షరీఫ్, రోశయ్య, రెహ్మాన్, బాబు, బత్తుల సత్యం, రాజ, హరి పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలకు చిరునామా వీపీఆర్

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు రూరల్, (చైతన్తరథం): పదిమందికి మేలు చేసే మానవతామూర్తి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి బుజబుజ నెల్లూరు ు కనుపర్తిపాడు ఫ్లైఓవర్లు మంజూరు విషయంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. అతి త్వరలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందిస్తారన్నారు.


























# ఉప్పొంగిన ఉత్సాహం.. సీఎం చంద్రబాబు పిలుపు సాకారం

అనంతపురం, (చైతన్యరథం): 75ఏళ్లలో కూడా 25ఏళ్ల యువకుడిలా చంద్రబాబు ఆలోచనలు ఉన్నాయని స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. శనివారం నగరంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అంబికా, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ ప్రారంభించారు. అక్టోబర్ -2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని శపథం చేశారు. నగరాన్ని స్వచ్ఛ అనంతగా మార్చడంలో ప్రజల సహకారం కావాలన్నారు.

**నందికొట్కూరులో...**

**నందికొట్కూరు:** నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య వివరించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద రెడ్డి, గ్రామ సర్పంచ్ రవికుమార్ యాదవ్, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

**కడపలో....**

**కడప:** కడప నగరం సెవెన్ రోడ్స్ నుండి 29వ డివిజన్ లో "మన కడప - స్వచ్ఛ కడప" కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప సెవెన్ రోడ్స్ సర్కిల్ 29వ డివిజన్ డివిజన్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్, శానిటేషన్ అధికారులు , డివిజన్ ఇంచార్జ్ టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

**కల్లూరులో,,,,**

**కల్లూరు అర్బన్: :** 20 వ వార్డ్ నంద్యాల చెక్ పోస్ట్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, మున్సిపల్ అధికారులు, వార్డ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

**ఎమ్మిగనూరులో...**

**ఎమ్మిగనూరు :** గత వైసీపీ ప్రభుత్వం చెత్తకు పన్ను వేస్తే.. కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టించి రాష్ట్రాన్ని ఆదాయం తీసుకోవస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులతో ఎమ్మెల్యే గారు ర్యాలీ చేపట్టారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ వైపు ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**శింగనమలలో...**

**శింగనమల:** ప్రతి నెల 3వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించు "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా పుట్లూరు మండల కేంద్రంలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర" కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు.

**మంత్రాలయంలో...**

**మంత్రాలయం:** మంత్రాలయం నియోజకవర్గం కోసిగి టౌన్ లోని కూటమి ప్రభుత్వం అదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గారు, కోసిగి టౌన్ సర్పంచ్ సంగిపోగు అయ్యమ్మ గారు పాల్గొన్నారు. మొదటగా కోసిగి బస్టాండ్ లో ఉన్న మొబైల్ షాప్ ల నుండి సేకరించి అక్కడి నుండి తెరు బజారులో ఉన్న చెత్తాచెదారాన్ని అధికారులు మరియు మండల నాయకులతో కలిసి పరిశుభ్రం చేశారు. అనంతరం ప్రతి గ్రామాన్ని ప్రతి వాడను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిరోజులో కొన్ని నిమిషాలు పరిశుభ్రత కోసం సమయాన్ని వెచ్చించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ముత్తురెడ్డి పల్లెపాడు రామిరెడ్డి, వక్రని వెంకటేష్ గారు జ్ఞానేష్ గారు,వలుగుందా కోసిగయ్య, సాతనూరు కోసిగియ్య,తోవి రామకృష్ణ, నాడిగినేని అయ్యన్న గారు,మాణిక్ రాజు,చింతలగేని నర్సిరెడ్డి,పెట్రోల్ బంక్ ఈరన్న,అరివిలి వీరేష్, నాడిగినేని తాయన్న గారు, మధు, పోతుల వీరారెడ్డి కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

## నేర్చుకోవాలే కానీ మీ ప్రస్థానం ఒక కేస్ స్టడీ!

75 ఏళ్ల వయసులో 100 మెట్లు సునాయాసంగా ఎక్కేస్తావ్... 75 ఏళ్ల వయసులో మీటింగుల్లో బస్సుకు ఉన్న నిటారు నిచ్చెన ఎవరి ఆసరా తీసుకోకుండా ఎక్కేస్తావ్... 75 ఏళ్ల వయసులో అక్రమ అరెస్టులో జైలు గోడల మధ్యలో 52 రోజులు ఆత్మవిశ్వాసంతో గడిపేశావ్ ...75 ఏళ్ళ వయసులో అనర్గళంగా గంటలకు పైగా అలానే నుంచుని స్పీచ్ దంచేస్తావ్... 75 ఏళ్ల వయసులో 47 డిగ్రీల ఎండలో కూడా అలుపు లేకుండా తిరుగుతావ్.. 75 ఏళ్ల వయసులో కదలకండా 20/365 డేస్ పనిచేస్తావ్... 75 ఏళ్ల వయసులో జేసీబీ ఎక్కి తుపాను సహాయ కార్యక్రమాల్లో అలుపు లేకుండ తిరుగుతావ్... 75 ఏళ్ళ వయసులో అన్నీ శాఖలు రివ్యూ ఒక్క రోజులో చేస్తావ్.. 75 ఏళ్ల వయసులో మైనస్ డిగ్రీలో కూడా స్వటర్ లేకుండా తిరగగలవ్...75 ఏళ్ల ముసలోడు అని తేలిక చెయ్యటానికి పగోడు నీ గురుంచి మాట్లాడొచ్చేమో కానీ సేవా మూర్తి మీరు.. మీకు వయస్సుతో పనేంటీ పిచ్చికాకపోతే...

**సీఎం చంద్రబాబుపై అభిమానంతో**
**డీకొండ ప్రశాంత్ బాబు (పోరంకి)**



# పెనుకొండ పట్టణ రూపురేఖలు మార్చేస్తాం

### 103 కోట్ల రూపాయలతో ఇంటింటికీ మంచినీరు.. మాటిచ్చాం.. నెరవేరుస్తున్నాం మంత్రి సవిత

పెనుకొండ, (చైతన్యరథం): రాజకీయ ఉనికి కోసమే వైసీపీ పోరాటాలు రాస్తారోకోలు చేస్తోందని మంత్రి సవిత అన్నారు. పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన మంత్రి సవితమ్మ. మున్సిపాలిటీ లోని ఉప్పరవాడలో 15 లక్షలు,బీటీ ఆర్ కాలనీలో 15 లక్షల రూపాయల నిధులతో డ్రైనేజ్ కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎన్నికల హామీల లో భాగంగా ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్డుకు 50 లక్షల రూపాయలు నిధులతో రోడ్డు పూర్తి చేసామని అదేవిధంగా వై జంక్షన్ వద్ద సెంట్రల్ లైటింగ్ పనులు కూడా పూర్తి చేశామని, కోనాపురం గ్రామానికి ఒక కోటి రూపాయలతో బీటీ రోడ్డు అదేవిధంగా 50 లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులు త్వరలో జరుగుతాయన్నారు. త్వరలో అన్నా కాంటీన్ ను 62 లక్షల రూపాయలతో భవనం నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ లో 2 కోట్ల 10 లక్షల రూపాయలతో నారాయణమ్మ కాలనీ డ్రైనేజీ బీటిఆర్ కాలనీ డ్రైనేజీ మరియు దర్గాపేట డ్రైనేజీ లకు ప్రతిపాదనలు పంపామని త్వరలో ప్రతిపాదనలు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. గత 5 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి మేము 10 నెలల లోనే చేసి చూపిస్తున్నాం. గత వైసిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి గాలికి వదిలేసారని తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. త్వరలో మున్సిపాలిటీలో ఇంటింటికి డస్ట్ బిన్ లు కూడా పంపిణీ చేస్తామన్నారు. త్వరలో అర్హులైన



నిరుపేదలందరికి హౌసింగ్ ఇస్తామన్నారు. రాష్ట్రంలో రాజకీయ ఉనికి కోసమే వైసిపి పార్టీ రాస్తా రోకోలు ధర్నాలు చేస్తున్నారని ప్రజల సమస్యలు కోసం కాదన్నారు. గత ప్రభుత్వం లో 5 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి,కూటమి ప్రభుత్వం లో 10 నెలల్లో జరిగిన అభివృద్ధి చర్చకోసం సిద్ధమని మంత్రి సవితమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# థాకరే సోదరుల మధ్య సయోధ్య?

**- హిందీకి వ్యతిరేకంగా కలిసి పనిచేయనున్నారనే సంకేతాలు**

ముంబయి: మహారాష్ట్రలో థాకరే సోదరులు తిరిగి కలిసి పనిచేయనున్నారనే సంకేతాలు వస్తున్నాయి. హిందీ వ్యతిరేకత సోదరుల మధ్య సయోధ్యకు కారణం కానుందని తెలుస్తోంది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ హిందీ, మరాఠీ మీడియం బడిపిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఇప్పటికే ఖండించగా.. తాజాగా శివసేన (యుబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే సమయంలో దీనిపై సమైక్యంగా పోరాడేందుకు ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. మరాఠీ ఉనికి, సంస్కృతికి ముప్పు ఏర్పడనుందనే భయాందోళనల నేపథ్యంలో థాకరే సోదరులు తిరిగి జత కట్టేందుకు సిద్ధపడుతున్నారు. కలిసి పనిచేయడం ఏమంత కష్టం కాదంటూ తాజాగా థాకరే సోదరులు వేర్వేరు కార్యక్రమాల్లో సంకేతాలిచ్చారు.

శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాకరే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థాకరేలు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొని ఉమ్మడి సందేశం ఇచ్చారు. మరాఠీ భాష, సాంస్కృతిక ప్రయోజనాల పరిరక్షణ చాలా ముఖ్యమని, దానిముందు రాజకీయ శత్రుత్వాలు పెద్ద విషయమేమీ కాదని అన్నారు.

నటుడు, ఫిల్మ్‌మేకర్ మహేష్ మంజ్రేకర్‌తో జరిగిన పాడ్‌కాస్ట్‌లో థాకరే సోదరులు తిరిగి కలిసి పనిచేసే అవకాశంపై రాజ్‌థాకరే మాట్లాడుతూ, తనకు, ఉద్ధవ్‌కు మధ్య విభేదాలు చాలా స్వల్పమని, వీటికంటే మహారాష్ట్ర (రాష్ట్ర ప్రయోజనాలు) తమకు చాలా ముఖ్యమని అన్నారు. విభేదాల వల్ల మహారాష్ట్రకు, మరాఠా ప్రజలకు చాలా నష్టం జరుగుతుందని నిరూపణ




అయింది. కలిసి పనిచేయడం పెద్ద కష్టమేమీ కాదు. మనసు ఉంటే మార్గం ఉంటుంది. ఇది కేవలం కోరికో, స్వార్థమో కాకూడదు. విశాల దృక్పథంతో దీనిని చూడాలి. మరాఠా ప్రజల కోసం రాజకీయ పార్టీలన్నీ ఐక్యమై ఒకే పార్టీగా ఏర్పడాలని రాజ్‌థాకరే అన్నారు. బాలాసాహెబ్ కింద తప్ప మరెవ్వరి కింద పనిచేయడం ఇష్టం లేక ఒంటరిగానే తాను బయటకు వెళ్లిపోయాయని రాజ్‌థాకరే గుర్తుచేశారు. ఉద్ధవ్‌తో కలిసి పనిచేయడానికి తనకు అభ్యంతరం లేదని, అయితే రెండోవైపు కూడా తనతో కలిసి పనిచేసేందుకు ఇష్టపడాలి కదా? అని అన్నారు. తాము కలిసి పనిచేయాలని మహారాష్ట్ర ప్రజలు కోరితే ఎలాంటి ఇగోల జోలికి వెళ్లేది లేదని స్పష్టం చేశారు.

కాగా, భారతీయ కాంగార్ సేన కార్యక్రమంలో ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ, చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టేందుకు తాను సిద్ధమేనని చెప్పారు. మహారాష్ట్ర ప్రయోజనాల కోసం మరాఠా ప్రజలంతా ఐక్యంగా ఉండాలి. అయితే ఒక షరతు. నిమిషానికో మాట మార్చేలా ఉండకూడదు. ఒకసారి మద్దతు ఇచ్చి, మరుసటి రోజే దానిని వ్యతిరేకించి, ఆ తర్వాత మళ్లీ రాజీపడి.. ఇలా ఉండకూడదు" అని ఆయన అన్నారు. మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండేవారిని తాను ఆహ్వానించడం కానీ, ఇంటికి పిలవడం కానీ, వారితో కలిసి కూర్చోవడం కానీ చేయనని అన్నారు. మొదట మహారాష్ట్ర ప్రయోజనాల విషయంలో స్పష్టత ఇవ్వాలని, అప్పుడు కలిసి పనిచేసేందుకు సిద్ధమని చెప్పారు.

హిందీని తప్పనిసరి చేయడంపై థాకరే సోదరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో 1 నుంచి 5వ తరగతి వరకూ హిందీని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంచలనం రేపుతోంది. ఈ పాలసీతో ఉద్ధవ్, రాజ్ థాకరే విభేదిస్తున్నారు. దీనిని మరాఠీ సంస్కృతిని బలహీనపరచే ప్రయత్నంగా వేర్వేరు ప్రకటనల్లో వీరు ఖండించారు. మరాఠీకి క్లాసికల్ లాంగ్వేజ్ హోదా ఇచ్చిన తరుణంలో హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం సరికాదని వారు తెలిపారు. హిందీని తప్పనిసరి చేయాలని మీరనుకుంటే, ఘట్కోపార్ (సెంట్రల్ ముంబై)లో గుజరాతీల అధిపత్యం ఉన్న ప్రాంతం)లో మరాఠీని తప్పనిసరి చేయాలని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు నేను చెప్పదలచుకున్నానని రాజ్‌థాకరే ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. నార్త్ ఇండియన్లు, గుజరాతీలు, ముస్లింలు అందరూ మనతో ఉన్నప్పుడు వారిని విడగొట్టాలని ఎందుకనుకుంటున్నారు. మేము హిందీకి వ్యతిరేకం కాదు. కానీ ఎందుకు ఆ భాషను తప్పనిసరి చేస్తున్నారని రాజ్ థాకరే ప్రశ్నించారు.

## దక్షిణాఫ్రికా నుంచి మరో 8 చీతాలు



భోపాల్: దక్షిణ ఆఫ్రికాలోని బోట్స్ వానా నుంచి భారత్‌కు మరో 8 చీతాలు రానున్నాయి. రెండు విడతల్లో బోట్స్‌వానా నుంచి ఈ చీతాలు రానున్నట్లు మధ్య ప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమా చారం ఇచ్చింది. మేలో 4 చీతాలు భారత్‌కు చేరుకుంటాయని అధికారులు తెలిపారు. తర్వాత మరో నాలుగు చీతాలను తీసుకురానున్నట్లు వెల్లడించారు. కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నేతృత్వంలో భోపాల్లో జరిగిన చిరుత ప్రాజెక్ట్ సమీక్ష సమావేశంలో ఎన్‌టీసీఏ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. దేశంలో చిరుత ప్రాజెక్ట్ కోసం ఇప్పటివరకు రూ.112 కోట్లకు పైగా ఖర్చు చేశామని, అందులో 67 శాతం మధ్యప్రదేశ్‌లో చిరుతల పునరావాసానికి కేటాయించామని అధికారులు తెలియజేశారు. 'ప్రాజెక్ట్ చీతా' కింద చిరుతలను రాజస్థాన్ సరిహద్దును ఆనుకొని ఉన్న గాంధీ సాగర్ అభయారణ్యంలోకి దశలవారీగా తరలించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్.. రాజస్థాన్ మధ్య అంతర్-రాష్ట్ర చిరుత సంరక్షణ ప్రాంతాన్ని ఏర్పాటుచేయడానికి సూత్రప్రాయంగా ఒప్పందం కుదిరిందని తెలిపారు. ప్రస్తుతం కునో నేషనల్ పార్క్ లో 26 చిరుతలు ఉన్నాయని అటవీ అధికారులు పేర్కొన్నారు. వాటిలో 16 బహిరంగ అడవిలో.. మరో 10 ఎన్‌క్లోజర్లలో ఉన్నాయి. ఆడ చీతాలు జ్వాలా, ఆశా, గామిని, వీరా పిల్లలకు జన్మనిచ్చాయి. కునోలో చిరుత సఫారీని ప్రారంభించడానికి అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

## గోళ్లు కత్తిరించి, విద్యుత్ షాక్ ఇచ్చి..!

**- కార్మికులకు యజమాని చిత్రహింసలు**

కోర్బా: తన ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఇద్దరు కార్మికులపై ఆ యజమాని దారుణంగా ప్రవర్తించాడు. దొంగతనం చేశారని ఆరోపిస్తూ వారిని చిత్రహింసలకు గురి చేశాడు. వాళ్ల గోళ్లను తొలగించి విద్యుత్ షాక్ ఇచ్చాడు. ఈ అమానవీయ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకుంది. రాజస్థాన్లోని భిల్వారా జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు.. ఛత్తీస్ గఢ్ లోని కోర్బా జిల్లాలో ఉన్న ఒక ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఫ్యాక్టరీలో దొంగతనం చేశారని ఆరోపిస్తూ యజమాని ఛోటూ గుర్జార్ తన సహాయకుడితో కలిసి వీరిద్దరిపై దాడి చేశాడు. వారిని అర్ధనగ్నంగా నిలబెట్టి చితకబాదాడు. వారి వేలి గోళ్లను తొలగించి.. విద్యుత్ షాక్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. ఆ ఇద్దరు బాధితులు అక్కడి నుంచి తప్పించుకుని తమ స్వగ్రామానికి చేరుకున్నారు. ఆ తర్వాత సమీపంలోని పోలీస్ స్టేషన్లో తమ యజమాని, అతడి సహాయకుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ తర్వాత కోర్బా పోలీస్ స్టేషన్లో యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే.. ఇప్పటివరకు ఈ కేసులో ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. కొన్ని అవసరాల నిమిత్తం మా యజమాని ఛోటూను రూ.20 వేలను ఇవ్వాలని కోరాం. కానీ, మా అభ్యర్థనను అతడు తిరస్కరించాడు. డబ్బు ఇవ్వకపోతే ఉద్యోగం వదిలి వెళ్లిపోతామని హెచ్చరించాం. దీంతో మా మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన యజమాని మాపై దాడి చేశాడు. తీవ్రంగా చిత్రహింసలకు గురి చేశాడని బాధితులు తెలిపారు.

# ఢిల్లీలో ఘోర ప్రమాదం

***భవనం కూలి 11 మంది మృతి***

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శక్తి విహార్ ప్రాంతంలోని ఓ నాలుగు అంతస్తుల భవనం తెల్లవారుజామున 3.02 గంటల సమయంలో ఒక్క సారిగా కూలిపోయింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. జాతీయ విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక సిబ్బంది, ఢిల్లీ పోలీసులు, వలంటీర్లు దాదాపు 12 గంటల పాటు శ్రమించి శిథిలాల కింద ఉన్న వారిని బయటకు తీసుకొచ్చారు.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ దుర్ఘటనలో భవనం యజమాని తెహ్‌సీన్ (60) మృతి చెందారు. మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరిలో ముగ్గురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. శిథిలాల కింద చిక్కుకుని గాయపడిన 11 మంది ఆసుపత్రిలో చికిత్స అందించగా వారిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారు. మిగతా వారికి చికిత్స కొనసాగుతోంది. తెల్లవారుజామున 2.39 గంటలకు ఈ ప్రమాదం జరిగిందని అడిషనల్ డీసీపీ తెలిపారు. సుమారు 2.50కి తమకు సమాచారం అందిందని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఢిల్లీ అగ్నిమాపక దళం కూడా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయని చెప్పారు. ఈ దుర్ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ కష్టకాలంలో బాధితులకు భగవంతుడు అండగా నిలవాలని తాను ప్రార్థిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. తొలుత భవనంలోని ఒక భాగం సడెన్‌గా కూలిపోయింది. ఆ మరుక్షణమే మొత్తం భవనం కుప్పకూలింది. క్షణాల వ్యవధిలో భవనం మొత్తం నేలమట్టమైంది. భవనం కూలడంతో భారీ ఎత్తున రేగిన దుమ్ము, ధూళి ఆ ప్రాంతాన్నంతా మేఘంలా ఆవరించింది. చుట్టుపక్కల ఏమున్నదీ కనిపించనంత స్థాయిలో దుమ్ము ఎగిసి పడింది. సీసీటీవీ కెమెరాల్లో రికార్డయిన ఈ భయానక దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట కలకలం రేపుతున్నాయి.

# ప్రవేశ పరీక్షల్లో జంధ్యం వివాదం

**- ఇద్దరు హోంగార్డులు సస్పెన్షన్**

శివమొగ్గ: వృత్తి విద్య కళాశాలల్లో చేరేందుకు నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్టు రాయడానికి వచ్చిన కొందరు విద్యార్థుల మెడలోని జంధ్యాన్ని తొలగించాలనడం కర్ణాటకలో కొత్త వివాదానికి దారి తీసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆదిచుంచనగిరి పీయూ కాలేజీ అధికారులపై కేసు నమోదు చేశారు. దీంతోపాటు శివమొగ్గలోని ఓ పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తించిన ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు వేశారు. శివమొగ్గలోని ఆదిచుంచనగిరి పీయూ కాలేజీ కేంద్రంలోకి వెళ్లే విద్యార్థులను తనిఖీ చేసిన అధికారులు.. ముగ్గురు విద్యార్థులను జంధ్యాన్ని తీసివేయాలని సూచించారు. ఓ విద్యార్థి జంధ్యం తీయడం ఇష్టంలేక వెనక్కు వెళ్లిపోగా.. దాన్ని తొలగించిన ఇద్దరిని పరీక్షకు అనుమతించినట్లు తెలిసింది. బీదర్ లోనూ ఇటువంటి ఘటనే చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలపై బ్రాహ్మణ మహాసభ, బీజేపీ భగ్గుమన్నాయి. దీంతో వెంటనే స్పందించిన కర్ణాటక పభుత్వం.. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప సూచనల మేరకు ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేస్తూ శివమొగ్గ పోలీసులు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేయాల్సి ఉందని జిల్లా పోలీసులు వెల్లడించారు. పూర్తిస్థాయి విచారణ జరుగుతోందన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి సెట్ నిర్వహణ విభాగానికి నివేదికను అందించినట్లు సమాచారం.



ఖండించిన కేంద్ర మంత్రి..

విద్యార్థుల జంధ్యం తొలగించిన ఘటనను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. రాష్ట్రంలో నకిలీ సెక్యులర్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. సంబంధిత అధికార యంత్రాంగం విచారం వ్యక్తం. చేసినప్పటికీ.. పరీక్ష రాయని విద్యార్థులకు పరిష్కారం చూపాలన్నారు.

# మాదారి మేం చూసుకుంటాం

*శాంతి ఒప్పంద ప్రయత్నంపై అమెరికా విసుగు*

*స్పందించిన రష్యా అధ్యక్ష కార్యాలయం - మేం చేయగలిగిందీ మేం చేస్తున్నాం: పెస్కోవ్*



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో పురోగతి ఏమీ కనిపించకుంటే.. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాలనుంచి తాము విరమించుకుంటామని అమెరికా ప్రకటన వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ స్పందించింది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్యలు తీసుకుంటామని.. ఈ దిశగా త్వరలో ముందుకు సాగే అవకాశం ఉందని పేర్కొంది. తమ సొంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి.. కీవ్, అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఈ చర్చలు చాలా క్లిష్టమని అంగీకరించినప్పటికీ.. వాటిని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ అధినేత పుతిన్‌కు మధ్య ప్రస్తుతం ముందస్తు సమావేశాలు లేవని.. కానీ అవసరం అయితే వెంటనే సమావేశమవుతామని డిమిత్రి పెస్కోవ్ తెలిపారు. ఈ ఘర్షణ విషయంలో ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌పై ఎలాంటి ఒత్తిడి తీసుకురావట్లేదని విమర్శించారు. సైనికీకరణ గురించి తప్ప ఆ దేశాలనుంచి ఎటువంటి శాంతి పిలుపులు లేవన్నారు. కాగా పారిస్‌లో జరిగిన భేటీలో శాంతి ఒప్పందం ముసాయిదాకు ఐరోపా దేశాల నేతలనుంచి సానుకూల స్పందన వచ్చిన నేపథ్యంలో వచ్చేవారం లండన్‌లో మరో రౌండ్ చర్చలు జరగనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

యుద్ధం విషయంలో చర్చలు కొలిక్కి రాకపోవడంపట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ విరమణ చేయించాలన్న తన ప్రయత్నాలకు ఆ రెండు దేశాలు సహకరించడంలేదని తెలిపారు. ఘర్షణ ముగించేందుకు కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రయత్నాలు విఫలమైనా, రష్యా-ఉక్రెయిన్ శాంతి ఒప్పందంలో పురోగతి సాధించలేకపోయినా చర్చల ప్రక్రియనుంచి అమెరికా వైదొలిగేందుకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెయిన్లలో ఏ దేశమైనా సరే ఏ ఒక్క కారణంతోనైనా శాంతి ప్రక్రియ నుంచి తప్పుకుంటే రెండు పక్షాలనూ తెలివితక్కువ వారుగా, మూర్ఖులుగా పరిగణిస్తామని శుక్రవారం శ్వేతసౌధంలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

## బంగ్లాలో హిందూనేత హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్



బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతోన్న దాడులపై తాజాగా భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బంగ్లాలో దినాజ్‌పూర్‌లో భబేశ్ చంద్ర మృతి ఘటన వేళ విదేశాంగశాఖ స్పందన వచ్చింది. "బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీ నేత భబేశ్ చంద్ర రాయ్ కిడ్నాప్, దారుణ హత్య గురించి మా దృష్టికి వచ్చింది. ఆ ఘటన ఎంతగానో కలచివేసింది. బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వపాలనలో హిందూ మైనారిటీలపై జరుగుతోన్న దాడుల్లో ఇది ఇంకో ఘటన. గతంలో ఈ తరహా దాడులకు పాల్పడినవారు ఎలాంటి శిక్ష లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ ఘటనను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎలాంటి సాకులు, వివక్ష లేకుండా మైనారిటీలను రక్షించే బాధ్యత ఈ తాత్కాలిక ప్రభుత్వం నిర్వహించాలని మరోసారి గుర్తుచేస్తున్నాం" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తన ప్రకటనలో స్పష్టం చేశారు. ఉత్తర బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్‌కు చెందిన భబేశ్ చంద్రరాయ్ (58)కు గురువారం సాయంత్రం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ఇంట్లోనే ఉన్నానని భబేశ్ అవతలి వ్యక్తికి చెప్పారు. అరగంట తర్వాత నలుగురు వ్యక్తులు ఆయన ఇంటికి వచ్చి బలవంతంగా తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గాలింపుచర్యలు చేపట్టిన పోలీసులకు నరబరి గ్రామంలో భబేశ్ తీవ్రగాయాలపాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కన్పించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. దుండగులు అతడిని తీవ్రంగా కొట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై క్రమంగా దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై భారత్ కూడా స్పందించింది. పొరుగుదేశంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొంది. వీటిని నివారించడానికి ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం మైనారిటీలు, హిందువుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపింది.

# అమెరికాను గ్రేట్‌గా మారుస్తా

*నా పని నన్ను చేసుకోనివ్వండి: ట్రంప్*



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న డిపోర్టేషన్ విధానంపై ఇతర దేశాల్లోనే కాకుండా అగ్రరాజ్యంలోనూ వ్యతిరేకతలు నెలకొంటున్నాయి. కిల్మార్ అబ్రెగో గార్సియా అనే వ్యక్తిని ట్రంప్ యంత్రాంగం ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన విషయంపై తీవ్ర దుమారం రేగింది. ట్రంప్ నిర్ణయాలను ఆయన రాజకీయ ప్రత్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. కాగా ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన కిల్మార్ అబ్రెగో గార్సియా 'ఎం-13' క్రిమినల్ ముఠాలో సభ్యుడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటూ.. షేర్ చేసిన ఫొటో.. మార్ఫింగ్ ఫొటో అని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు.

దీనిపై అమెరికా అధ్యక్షుడు స్పందిస్తూ.. ఎల్ సాల్వెడార్‌కు బహిష్కరించిన కిల్మార్ అబ్రెగో గార్సియా 'ఎం-13' క్రిమినల్ ముఠాలో సభ్యుడని.. గ్యాంగ్ పేరుతో అతడు టాటూ కూడా వేయించుకున్నాడన్నారు. న్యాయస్థానాలు కూడా ఈవిషయాన్ని ధ్రువీకరించాయని, అమెరికాను గ్రేట్‌గా మార్చడానికే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నానన్నారు. దయచేసి తన పనిని తాను చేసుకోనివ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు. శుక్రవారం ట్రంప్ గార్సియా చేతివేళ్లకు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. "ఇటువంటి హింసాత్మక ముఠా సభ్యుడికి మద్దతిస్తూ.. ప్రతిపక్ష డెమోక్రాట్లు అతడిని అమాయకుడిగా పేర్కొంటున్నారు. అతడు క్రూర స్వభావం కలవాడని.. భార్యని తీవ్రంగా కొట్టి హింసిస్తాడని.. అధికారులు పేర్కొన్నారు. అవన్నీ దృష్టిలో పెట్టుకొని ఇటువంటి చెడు స్వభావం గల వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరిస్తూ.. దేశాన్ని మళ్లీ గొప్పగా చేయడానికి కృషి చేస్తున్నాను" అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

అయితే ఇది ఆ వ్యక్తికి సంబంధించిన టాటూ కాదని.. చేతివేళ్ల ఫొటో తీసి దానిపై టాటూను టైప్ చేసినట్లుగా ఉందని పలువురు నెటిజన్లు అనుమానం వ్యక్తంచేశారు. మిన్నెసోటా రాష్ట్ర మాజీ సెనేటర్ లిండా హిగ్గిన్స్ దీనిపై స్పందిస్తూ.. ట్రంప్ తను చేస్తున్న చట్టవిరుద్ధమైన చర్యలు బాగా కనిపించేలా ఫొటోను రూపొందించారని అన్నారు. ఫొటోషాప్ గురించి ఆయనకు ఎవరైనా నేర్పించాల్సి ఉంటుందన్నారు. పలువురు నెటిజన్లు గార్సియాకు సంబంధించిన పాత చిత్రాలను పంచుకుంటూ.. ఆయన చేతివేళ్లపై 'ఎం-13 అక్షరాలు లేవని పేర్కొంటున్నారు.



## మనుషుల మారథాన్‌లో రోబోల పరుగులు

కాలంతోపాటు మారుతున్న సాంకేతికత.. ప్రజల జీవితాలను ఎంతో సులభతరం చేస్తోంది. ఇప్పటికే వార్తలు చదివే రోబో... హెూటళ్లల్లో సర్వ్ చేసే రోబో, ఇంటి పనులకో రోబోల గురించి మనం విన్నాం.. చూశాం. తాజాగా మారథాన్‌లో మనుషులతో పోటీపడే రోబోలు వచ్చేశాయి. చైనాలో జరిగిన హాఫ్- మారథాన్‌లో ఈ రోబోలను మనం చూడొచ్చు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌వంటి రంగాల్లో చైనా తన ఆధిపత్యాన్ని సాధించాలని చూస్తోంది. అందుకుతగ్గట్టుగానే అడుగులు వేస్తోంది. ఈక్రమంలో బీజింగ్‌లో యిజువాంగ్ హాఫ్-మారథాన్‌ను నిర్వహించారు. ఈ మారథాన్‌లో 21 కిలోమీటర్ల పరుగులు పెట్టేందుకు వేలాదిమంది రన్నర్లతోపాటు 21రోబోలు కూడా పోటీపడ్డాయి. ఈ పోటీకి కొన్ని వారాల ముందే వీటిని పరీక్షించి మరీ బరిలోకి దింపినట్లు ఆ దేశ మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. డ్రాగన్ దేశంలో గతంలో జరిగిన అనేక మారథాన్లలో రోబోలు కనిపించాయి. అయితే, మనుషులతో కలిసి పోటీపడటం మాత్రం ఇదే తొలిసారి.

## ఇరాన్ అణుస్థావరాలపై దాడులకు ఇజ్రాయెల్ వ్యూహం



ఇరాన్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేసే యోచనలో ఉన్న ఇజ్రాయెల్‌ను అమెరికా అధ్యక్షుడు వారిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ రానున్న రోజుల్లో ఇరాన్ స్థావరాలపై దాడులను తోసిపుచ్చలేమని ఇజ్రాయెల్ అధికారులు చెబుతుండటం గమనార్హం. అణు ఒప్పందానికి సంబంధించి అమెరికా- ఇరాన్ మధ్య రెండో దఫా చర్చలు రోమ్‌లో జరుగుతున్న వేళ తాజా అంశం వెలుగులోకి వచ్చింది.

ఇరాన్ అణుస్థావరాలపై దాడికి సంబంధించి ట్రంప్ యంత్రాగానికి ఇజ్రాయెల్ కొంతకాలంగా పలు ప్రతిపాదనలు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొన్ని నెలల్లో లేదా ఓ సంవత్సర కాలంలో టెహ్రాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు వైమానిక దాడులతోపాటు కమాండో ఆపరేషన్లు చేపట్టాలని ఇజ్రాయెల్ సూచించినట్లు తెలిసింది. అయితే, ఇటీవల వైట్ హౌస్‌లో నెతన్యాహుతో జరిగిన భేటీలో ఇదే అంశంపై చర్చించిన ట్రంప్.. స్వల్పకాలంలో దాడులకు మద్దతు ఇవ్వలేనని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఇరాన్‌తో దౌత్యపర చర్చలకే తాను ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేసినట్టు సమాచారం. అయినప్పటికీ అమెరికా మద్దతు లేకుండానే ఇరాన్ స్థావరాలపై పరిమిత దాడులు చేయాలనే ఆలోచనలో నెతన్యాహు అధికారులు ఉన్నట్టు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య కీలక చర్చలు జరుగుతున్న వేళ ఇజ్రాయెల్ చర్యలు ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయన్నది చర్చనీయాంశమైంది.

## అఫ్గాన్‌లో భూకంపం ఢిల్లీలోనూ ప్రకంపనలు

అఫ్గానిస్థాన్- తజికిస్థాన్ సరిహద్దుల్లో శనివారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదైంది. 86 కిలోమీటర్ల దూరంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. మరోవైపు.. భూకంపం కారణంగా ఢిల్లీ, జమ్మూకశ్మీర్ సహా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు సంభవించాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు.

# 2 పరుగులు తేడాతో లక్నో విజయం

ఐపీఎల్ 2025లో భాగంగా తాజాగా జరిగిన ఉత్కంఠ మ్యాచులో రాజస్థాన్ రాయల్స్‌కు మరోసారి దురదృష్టం వెంటాడింది. ఆఖరి ఓవర్ లో దోబూచులాడిన విజయం చివరికి లక్నో సూపర్ జెయింట్స్ ను వరించింది. 2 పరుగులు తేడాతో గెలిచింది. ఆఖరి ఓవర్ లో రాజస్థాన్ విజయానికి 9 పరుగులు అవసరం అవ్వగా, ఆవేశ్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 6 పరుగులే ఇచ్చి హెట్మెయర్ (12) ను ఔట్ చేసి.. తమ జట్టుకు విజయాన్ని అందించాడు. కాగా, 8 మ్యాచుల్లో రాజస్థాన్ కు ఇది 8వ ఓటమి, పాయింట్ల పట్టికలో 8 స్థానంలో నిలిచింది. లక్నోకు ఇది ఐదో విజయం కాగా, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్థాన్ కు మంచి శుభారంభం దక్కింది. 14 ఏళ్ల టీనేజర్ వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 34 పరుగులు) తన అరంగేట్ర మ్యాచులోనే గర్జించాడు. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (52 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 74 పరుగులు) చేశాడు. వీరిద్దరు కలిసి తొలి వికెట్ కు 85 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మార్క్ క్రమ్ బౌలింగ్ లో 8.4 ఓవర్ వద్ద వికెట్ కీపర్ పంత్ చేతిలో వైభవ్ స్టంపౌట్ అయ్యాడు.

ఆ తర్వాత వచ్చిన నితీశ్ రాణా (8) విఫలమయ్యాడు. రెండో వికెట్ గా వెనుదిరిగాడు. శార్దూల్ బౌలింగ్ లో 9.6 ఓవర్ దగ్గర ఆవేశ్ ఖాన్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం మూడో వికెట్ గా యశస్వి జైశ్వాల్ పెవిలియన్ చేరగా.. నాలుగో వికెట్ గా రియాన్ పరాగ్ (39) వెనుదిరిగాడు. సిమ్రాన్ హెట్మెయర్ (12) నిరాశపరిచాడు. లక్నో బౌలర్లలో ఆవేశ్ ఖాన్ 3 వికెట్లతో మెరిశాడు. శార్దూల్ ఠాకూర్,మారక్రమ్ వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ లో ఓపెనర్ ఐదెన్ మార్క్రమ్ (45 బంతుల్లో 66బీ 5 ఫోర్లు, 3 సిక్సలు), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ బదోని (34 బంతుల్లో 50బీ 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలో అదరగొట్టారు. ఇక ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 30లిబీ) నాలుగు సిక్స్‌లు బాది స్కోరును 180కి చేర్చాడు. ఈ క్రమంలో మార్క్రమ్, బదోని జోడీ నాలుగో వికెట్‌కు 76 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. మిచెల్ మార్ష్ (4), నికోలస్ పూరన్ (11), రిషభ్ పంత్ (3) ఫెయిల్ విఫలమయ్యారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగ 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.









# ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం

## ఢిల్లీ క్యాపిటల్స్‌పై 7 వికెట్ల తేడాతో విజయం





ఐపీఎల్ 2025లో తాజాగా జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించి చరిత్ర సృష్టించింది. దిల్లీ క్యాపిటల్స్ జట్టుపై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. 19.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పటివరకు దిల్లీ క్యాపిటల్స్‌పై 200 ప్లస్ పరుగుల ఛేజ్‌ను ఏ జట్టు చేయలేకపోయింది. కానీ ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలో తొలిసారి గుజరాత్ టైటాన్స్.. ఆ ఘనత సాధించింది. దిల్లీ క్యాపిటల్స్ పై 203 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

గుజరాత్ బ్యాటర్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. జాస్ బట్లర్ (97) చెలరేగాడు. సాయి సుదర్శన్ (21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 36 పరుగులు) రాణించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (7) నిరాశపరిచాడు. షెర్ఫనే రూథర్ ఫోర్డ్ (34 బంతుల్లో 1 ఫోర్ల్, 3 సిక్సుల సాయంతో 43 పరుగులు) అద్భుతంగా రాణించాడు. జోస్ బట్లర్ (97) అద్భుతం చేశాడు. ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీశారు.

**గుజరాత్ ఇన్నింగ్స్ సాగిందిలా..**

గుజరాత్ కు ప్రారంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండో ఓవర్ లో కరుణ్ నాయర్ వేసిన అద్భుత త్రో వల్ల కెప్టెన్ శుభమాన్ గిల్ (7) వెనుదిరిగాడు. అప్పుడు వచ్చిన బట్లర్ తో పాటు సాయి సుదర్శన్ గుజరాత్ ఇన్నింగ్స్ ను పరుగెత్తించారు. దీంతో గుజరాత్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 67 పరుగులు నమోదు చేసింది.

ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ జోరు మీదున్న సాయి సుదర్శన్ (36) ను పెవిలియన్ కు పంపాడు. కానీ బట్లర్, రూథర్ ఫోర్డ్ కలిసి ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరూ భారీ షాట్లతో చెలరేగి ఆడారు. దీంతో మ్యాచ్ పూర్తిగా గుజరాత్ వైపునకు వచ్చేసింది. అయితే జట్టు విజయం కోసం చివరి వరకు క్రీజు లో ఉన్న బట్లర్ సెంచరీ పూర్తి చేసుకోలేకపోయాడు. చివరి ఓవర్‌లో విజయానికి 10 పరుగులు అవసరమైన నేపథ్యంలో రాహుల్ తెవాతియా (11లిబీ 3 బంతుల్లో) వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కు ఇదే అత్యధిక విజయవంతమైన లక్ష్యఛేదన కావడం విశేషం.

**ప్రసిద్ధ్ కృష్ణ చెలరేగినా.. దిల్లీ బ్యాటర్లు సమిష్టిగా..**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన దిల్లీ క్యాపిటల్స్ లో బ్యాటర్లందరూ రాణించారు. అందరూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. ఓపెనర్లు అభిషేక్ పొరెల్ (9 బంతుల్లో 18బీ 3 ఫోర్లు, 1 సిక్స్), కరుణ్ నాయర్ (18 బంతుల్లో 31బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉన్నది కేసేపే అయినా మెరుపులు మెరిపించారు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 28బీ 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా దూకుడు ప్రదర్శనే చేశాడు. దీంతో 4 ఓవర్లకే స్కోరు 50 దాటేసింది. ముఖ్యంగా కరుణ్ నాయర్ ధాటిగా ఆడటం వల్ల పవర్ ప్లే ముగిసేసరికి దిల్లీ జట్టు 73/2తో బలమైన స్కోరుకు పునాది వేసుకుంది.ఆ తర్వాత అక్షర్ పటేల్ (32 బంతుల్లో 38బీ 1 ఫోర్, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (21 బంతుల్లో 31బీ 2 ఫోర్లు, 1 సిక్స్) మంచి ప్రదర్శనే చేశారు. ఆఖర్లో అశుతోష్ శర్మ (19 బంతుల్లో 37బీ 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచికొట్టాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (4/41) అదరగొట్టాడు. అర్షద్ ఖాన్, సిరాజ్, ఇషాంత్ శర్మ, సాయి కిశోర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. దీంతో డీసీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది.




## తొలి బంతికే గర్జించిన చిట్టి సింహం..!

లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతోన్న మ్యాచులో టీనేజ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అతి పిన్న వయసు (14 ఏళ్ల 23 రోజులు)లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అతడు.. తన తొలి మ్యాచును ఎప్పటికీ గుర్తుండిపోయేలా మలుచుకున్నాడు. అరంగేట్ర మ్యాచులో సెన్సేషనల్ బ్యాటింగ్ తో అద్భుతంగా కెరీర్ ప్రారంభించిన అతడు.. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సుగా మలిచి క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. శార్దూల్ వేసిన బంతిని కవర్స్ మీదుగా బాది అద్భుతమైన సిక్సుగా మలిచాడు. తద్వారా తొలి మ్యాచులోనే సిక్సర్ తో ఇన్నింగ్స్ ప్రారంభించిన పిన్న వయస్కుడిగా నిలిచాడు. మూడో బంతిని కూడా సిక్స్ బాది అదరగొట్టాడు.

ఈ మ్యాచులో వైభవ్ సూర్యవంశీ పైకి కామ్ గా కనపడుతూనే ఎంతో ధైర్యంగా బ్యాటింగ్ చేశాడు. తన బ్యాటును ఝళిపించి.. ప్రతీ బంతిని బలంగా బాదాడు. మొత్తంగా బ్రిలియంట్ బౌండరీలు, అదిరే సిక్సులతో మైదానాన్ని హోరెత్తించాడు. 20 బంతులు ఎదుర్కొని 2 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 34 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మార్ క్రమ్ బౌలింగ్ లో 8.4 ఓవర్ వద్ద వికెట్ కీపర్ రిషభ్ పంత్.. అతడి స్టంపౌట్ చేశాడు. అయితే అతడి ప్రదర్శనతో మంత్రముగ్ధులైన క్రికెట్ అభిమానులంతా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

కాగా, బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీని.. గతేడాది మెగా వేలంలో రూ.1.10 కోట్ల ధరకు కొనుగోలు చేసింది రాజస్థాన్ రాయల్స్. దిల్లీ క్యాపిటల్స్‌తో పోటీపడి మరీ అతడిని రాజస్థాన్ రాయల్స్ దక్కించుకుంది. దీంతో వేలంలో అమ్ముడుపోయిన అతిపిన్న వయసు ఆటగాడిగానూ వైభవ్ రికార్డు సృష్టించాడు.

**అప్పటికీ పుట్టనేలేదు..**

2008లో ఐపీఎల్ ప్రారంభ సమయానికి వైభవ్ ఇంకా పుట్టనేలేదు. సూర్యవంశీది రైతు కుటుంబం. అతడి తండ్రి ఒక రైతు. అయితే వంశీ నాలుగేళ్ల వయసులోనే క్రికెట్ బ్యాట్ పట్టాడు. దీంతో అతడి కోసం తండ్రి సంజీవ్ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించారు. ఆ తర్వాత క్రికెట్‌లో రాణించిన వైభవ్.. అండర్-16 ఆడాడు. అనంతరం ఈ ఏడాది చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన భారత్ అండర్-19 యూత్ టెస్టులోనూ అదిరే ప్రదర్శన చేశాడు. 62 బంతుల్లో 104 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని తన వైపునకు తిప్పుకున్నాడు. అండర్-19 టెస్టు క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ బాది అందరి దృష్టిని ఆకర్షించాడు.

చైతన్య రథం సినిమా
ఆదివారం 20 ఏప్రిల్ 2025 13

బ్లో అప్
ప్రియాంక మోహన్





## పెళ్లిపై నాకు నమ్మకం లేదు..

నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా? అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లయినా ఓకే, కాకున్నా ఫర్వాలేదు" అన్నారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు. త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండించారు. "పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో కూడా నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడుంటాడనే నమ్మకం కలగాలి. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం ఇష్టం లేదు అంటోంది త్రిష.

## అర్జున్ సర్కారే ట్రెండింగ్..!

*పాన్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హిట్-3'. ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషన్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను ఏప్రిల్ 14న రిలీజ్ చేశారు. ఇక ఈ ట్రైలర్ ఆద్యంతం బ్లడ్‌బాత్‌గా ఉండటంతో నాని ఈ సినిమాలో ఎలాంటి రక్తపాతం సృష్టిస్తాడా? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ అయిన దగ్గర్నుండి ఏకంగా 100 గంటలపాటు యూట్యూబ్‌లో టాప్ 1వ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోందట. ఈ సినిమాలో అందాల భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది.*



## టైటిల్ అప్పుడేనట!



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ఇపుడు చేస్తున్న చిత్రాల్లో సెన్సేషనల్ మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం కూడా ఒకటి. ఈ సినిమా ఎన్టీఆర్ కెరీర్లో 29వ చిత్రంగా రెడీ అవుతోంది. సినిమా టైటిల్ కోసం అభిమానులు అనౌన్స్‌మెంట్ చేసిన రోజునుంచి ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ కూడా ఆల్రెడీ మొదలై వేగంగా జరుగుతోంది. అయితే ఎన్టీఆర్ లేని సన్నివేశాలతో నీల్ స్టార్ట్ చేయగా కొన్ని రోజుల్లో తారక్ కూడా సెట్స్‌లో అడుగు పెట్టనున్నాడట. మరి గతంలో సలార్ తరహా లోనే షూటింగ్ స్టార్ట్ చేసినా.. తక్కువ సమయంలోనే ఫస్ట్ లుక్ పోస్టర్స్ ఇచ్చేసినట్టు ఇపుడు కూడా ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్ నుంచి ఫస్ట్ పోస్టర్‌ని అందించనున్నట్టుగా తెలుస్తుంది. రానున్న మే నెలలో తారక్ పుట్టినరోజు కానుకగా ఫస్ట్ లుక్ సహా టైటిల్ కూడా రిలీజ్ ఆరోజే ఉంటుందని తెలుస్తుంది. మరి దీనిపై ఇంకా అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

### ఆ నొప్పి మీకుంటే..

"పీరియడ్ పెయిన్ అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుంది. ఆ సమయంలో మేం పడే బాధను, మానసిక స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణుయుద్ధాలే జరిగేవేమో..!" అని జాన్వీ అన్నారు. ఈ విషయం గురించి ఆమె ధైర్యంగా మాట్లాడారంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చ అవసరమని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఇక ఇటీవల సమంత కూడా మహిళల నెలసరి సమస్యల గురించి మాట్లాడారు. ఇప్పటికీ కూడా కొందరు దీని గురించి బహిరంగంగా మాట్లాడాలంటే సిగ్గుపడుతున్నారని అన్నారు. అది పెద్ద తప్పు అన్నట్లు గుసగుసలాడుతుంటారని, ఈ ధోరణిలో మార్పు రావాలని కోరారు. ఇది మహిళల్లో జరిగే సహజ ప్రక్రియ అని తెలిపారు. నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే బాధ వర్ణనాతీతం. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇక అప్పుడు వచ్చే మూడ్ స్వింగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, నెలసరిలో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధగా ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రస్తావించారు నటి జాన్వీ కపూర్. తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయన్నారు. నాకు ఆ సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరు బట్టి నేను ఆ పరిస్థితిలో ఉన్నానని ఎదుటి వారికి అర్థం అయిపోతుంది అంది జాన్వీ.

## ఫుల్ స్వింగులో..



సూపర్ స్టార్ మహేష్ బాబు అలాగే గ్లోబల్ దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి కలయికలో తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రంఅందరికీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్లో 29వ సినిమాగా తెరకెక్కి స్తుండగా నెక్స్ట్ లెవెల్ హైప్ దీనిపై ఉంది. ఇక ఈ సినిమా షూటింగ్ లేట్‌గానే మొదలైనా ఇపుడు శరవేగంగా కంప్లీట్ అవుతున్నట్టుగా కనిపిస్తోంది. సినిమాను తీర్చిదిద్దుతున్న జక్కన్న.. తన రొటీన్ స్టయిల్‌కు భిన్నంగా షూట్‌ను పరిగెత్తిస్తున్నాడట. అదే ఇప్పుడు ఈ ప్రాజెక్టుపై ఇంట్రెస్టింగ్ న్యూస్. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అప్పుడే మూడో షెడ్యూల్ లోకి ఎంటర్ అయ్యిందని అంటున్నారు. అయినా, జక్కన్న అండ్ టీం మాత్రం వెరీ సైలెంట్‌గా,, చకచకా పనులు పూర్తి చేస్తున్నారన్న టాక్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది. అలాగే ఈ కొత్త షెడ్యూల్‌లో నటి ప్రియాంక చోప్రా కూడా జాయిన్ అయినట్టుగా సమాచారం. మొత్తానికి రాజమౌళి, మహేష్‌ల భారీ ప్రాజెక్టు ఫుల్ స్వింగ్‌లో నడుస్తుందని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.



## విజయ్ డేట్.. 'పవన్‌కి'

ప్రస్తుతం టాలీవుడ్ నుంచి రానున్న పలు భారీ చిత్రాల్లో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న అవైటెడ్ చిత్రం "హరిహర వీరమల్లు" ఒకటి. మరి ఈ చిత్రాన్ని మేకర్స్ మే 9కి ప్లాన్ చేశారు కానీ ఈ డేట్‌లో కూడా ఈ చిత్రం వచ్చే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఆల్రెడీ సమంత తన ప్రొడక్షన్ సినిమాని ఆ డేట్‌కి లాక్ చేసుకునే సరికి పవన్ సినిమా రావడం లేదనే టాక్ మరింత బలపడింది. అయితే ఇపుడు పవన్ విజయ్ దేవరకొండ డేట్‌కి రానున్నట్టుగా తెలుస్తుంది. మే 30న విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ చిత్రం కింగ్‌డమ్ ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ డేట్‌లో వీరమల్లు వచ్చే ఛాన్స్ ఉందట. అది కూడా ఈ మధ్యలో పవన్ ఏమన్నా డేట్స్ ఇస్తే.. ఆ డేట్‌కి మేకర్స్ రావాలనుకుంటున్నారట. లేదా జూన్‌కే షిఫ్ట్ అవుతుంది అని తెలుస్తుంది. మరి దీనిపై ఒక క్లారిటీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఏఐ టెక్నాలజీతో ప్రమాదమే..

*ప్రస్తుతం ఏఐ ప్రవేశించని రంగం లేదు. ఇటీవలకాలంలో సినిమాల్లోనూ దీని వినియోగం పెరిగిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపయోగించి దివంగత గాయకుల వాయిస్‌తో పాటలు క్రియేట్ చేస్తున్నారు. ఈ విషయంపై ఏఆర్ రెహమాన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీనిని నియంత్రించకపోతే భవిష్యత్తులో గందరగోళ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ఏఐ టెక్నాలజీ ఎంతో శక్తిమంతమైనదని కానీ, అవసరానికి మించి దీన్ని వినియోగించకూడదన్నారు. "ఏఐవల్ల మంచి, చెడు రెండూ ఉన్నాయి. మంచి కోసం మాత్రమే దీన్ని వినియోగించాలి. కొన్ని రోజులుగా దీని వినియోగం చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. కొన్ని చెత్త పాటలను కూడా గొప్ప గాయకులు పాడినట్లు క్రియేట్ చేస్తున్నారు. దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియడం లేదు. ప్రతి దానికి కొన్ని నియమాలు ఉంటాయి. పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించడానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని అందరూ తెలుసుకోవాలి" అని అన్నారు.*

*గతేడాది విడుదలైన 'లాల్ సలామ్'లో ఏఆర్ రెహమాన్ కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించి దివంగత గాయకులు బంబా బక్యా, షాహుల్ హమీద్‌ల గాత్రాన్ని పునఃసృష్టించిన విషయం తెలిసిందే. ఈ గాయకులిద్దరూ గతంలో రెహమాన్ సంగీతం సమకూర్చిన చాలా సినిమాల్లో పాడారు. గాయకులిద్దరి కుటుంబాల అనుమతి తీసుకొని కృత్రిమ మేధ అల్గారిథమ్ ద్వారా మరోసారి వారి వాయిస్‌ను వినిపించారు.*

